

ప్రకృతి విపత్తులు తప్పవు కానీ ముందస్తు జాగ్రత్తలతో నష్టాన్ని తగ్గించవచ్చని సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరూపించింది. మొంథా తుఫాన్‌పై ముందస్తు చర్యలు, సమన్వయంతో రాష్ట్రం పెద్ద నష్టాల నుంచి రక్షించబడింది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 31.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 194 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# మొంథా తుఫాన్... పర్ఫెక్ట్ హ్యాండ్లింగ్

● తుఫాన్ సహాయక చర్యల్లో ప్రతిబింబించిన సీబీఎన్ మార్క్ ● ఆర్టీజీ సెంటర్ నుంచి రియల్ టైమ్‌లో పర్యవేక్షణ, పరిష్కారం

● ఫైవ్ పాయింట్ ఫార్ములాతో పని చేసిన టీమ్ ఆంధ్రప్రదేశ్ ● మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ వంటి అంశాలపై ఫోకస్

● రక్షణ - సహాయక చర్యల్లో పూర్తి స్థాయిలో టెక్నాలజీ వినియోగం ● ప్రభుత్వ ముందస్తు చర్యలతో తగ్గిన ఆస్తి, ప్రాణ నష్టం


● క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల్ని పరామర్శించిన సీఎం చంద్రబాబు ● రాష్ట్ర సచివాలయం నుంచి ఆదేశాలు..గ్రామ స్థాయిలో తక్షణం అమలు

● ఐదు రోజుల పాటు రాత్రి పగలు పనిచేసిన అధికార యంత్రాంగం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ. మొంథా తుఫాను విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం అమలు చేసిన పంచసూత్ర ప్రణాళిక ఇదే. తుఫాన్ హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి నిరంతరం మానిటర్ చేసుకోవడం... ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని.. ప్రజలను అలెర్ట్ చేయడం, నీట మునిగిన ప్రాంతాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి పునరావాసం కల్పించడం.. తుఫాన్ తగ్గాక.. సాధారణ పరిస్థితులు తీసుకురావడం. మొంథా తుఫాన్ సమయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని బృందం ఈ అంశాలపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. దీనికి పూర్తి స్థాయి టెక్నాలజీని జోడించడం, క్షేత్రస్థాయిలో మంత్రులు, అధికారులు, ఉద్యోగులతో కూడిన బృందాలతో సమర్థవంతంగా పని చేయించడంతో మొంథా తుఫాను వల్ల కలిగే నష్టాన్ని చాలా వరకు నివారించగలిగింది. ప్రకృతి విపత్తును నివారించే అవకాశం లేదు కాబట్టి...నష్టాన్ని వీలైనంత వం-కు తగ్గించుకోవాలనే లక్ష్యంతో టీం ఆంధ్రప్రదేశ్ పని చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించుకునే దిశగా ఐదు రోజుల పాటు రాత్రి-పగలు తేడా లేకుండా అధికార యంత్రాంగం పనిచేసింది. ఇదే ఇప్పుడు సత్ఫలితాలను ఇచ్చింది. మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రం మీద ఎక్కువగా ఉంటుందనే వాతావరణ హెచ్చరిక రాగానే సీఎం చంద్రబాబు అలెర్ట్ అయ్యారు. తుఫాన్ కదలికలను నిరంతరం మానిటర్ చేసుకోవడం... ఏయే ప్రాంతాల్లో ఎక్కువ తుఫాన్ ప్రభావం ఉండొచ్చనే విషయాలపై మానిటరింగ్ చేసుకోవడం... ఆ దిశగా క్షేత్ర స్థాయిలో ఉన్న వారిని అలెర్ట్ చేస్తూ... మొంథా తుఫాన్ తీరాన్ని తాకినా... ప్రజల జీవితాలను తాకకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది ప్రభుత్వం. కొద్దిపాటి ప్రభావం ఉంటుందనుకున్న ప్రాంతాల్లోని వారిని కూడా పునరావాస శిబిరాలకు తరలించారు. లక్ష మందికి పైగా ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. క్షేత్ర స్థాయి నుంచి రియల్ టైంలో సమాచారాన్ని తీసుకోవడం.. దాన్ని విశ్లేషించడం... వాటిని ఆయా విభాగాల బాధ్యులకు చేరవేసి.. సమస్యను పరిష్కరించేలా చూడడం వంటి ప్రక్రియను సీఎం చంద్రబాబు నేతృత్వంలో బృందం సమర్థవంతంగా అమలు చేసింది. ఇక సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యటించి... బాధితులకు భరోసా ఇచ్చారు.

**అనుభవానికి టెక్నాలజీ తోడు:** ఇక ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేలా ప్రభుత్వం ఈ విపత్తు కాలంలో పని చేసింది. శిశువుల నుంచి వృద్ధుల వరకు.. అలాగే గర్భిణులను కూడా సంరక్షణ కేంద్రానికి తరలించింది. పశువుల ప్రాణాలను కూడా కాపాడేందుకు యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సమాయత్తం చేశారు. దీనికి టెక్నాలజీని జోడించారు. దీంట్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు వరుసగా 1.1 కోట్ల సందేశాలు పంపారు. అలాగే సాంకేతికతను జోడించి గ్రామాల్లో మైక్ ద్వారా ఎనౌన్సుమెంట్ చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆర్టీజీ సెంటర్ నుంచే సెల్ ఫోన్ ద్వారా ఆ మైక్ ఎనౌన్సుమెంటును ఆపరేట్ విధానాన్ని రూపొందించడమే కాకుండా..

మిగతా 2లో...



## యుద్ధ ప్రాతిపదికన పంటనష్టం అంచనా... పరిహారం చెల్లింపు

**అవనిగడ్డ (జర్నలిస్ట్ ఫైల్) :**'మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామ'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందనీ చెప్పారు. ఈ జిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించిన పవన్ కళ్యాణ్. మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదన తెలుసుకున్నారు. అనంతరం కృష్ణా జిల్లా అధికారులు అవనిగడ్డలో తుపాను నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత మూలంగా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోగలిగాం. పక్కా ప్రణాళికతో నష్టం తీవ్రతను తగ్గించాం. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపు కారణంగానే తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వీడియో కాన్ఫరెన్సులు, ఆర్టీజీఎస్ ద్వారా 24 గంటలు



పరిస్థితులను పర్యవేక్షిస్తూ.. అటు యంత్రాంగాన్ని, ఇటు గ్రామ స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేశాం. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా లక్ష 16 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఈ విపత్తులో కౌలు రైతులు కూడా నష్టపోయిన విషయం నా దృష్టికి వచ్చింది. వారిని ఆదుకొనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతాను.

**అంటు వ్యాధులు ప్రబలకుండా సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ :** తుపాను అనంతర ఉపశమన చర్యలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాం. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో

మిగతా 2లో...

## టెక్నాలజీ సాయంతో తుపాను నష్టం తగ్గించాం


● ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే అంశంలో ప్రభుత్వం అనుసరించిన విధానం ఒక మాన్యువల్

● క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పర్యటించారు

● గ్రామస్థాయి సిబ్బంది నుంచి ప్రధాన కార్యదర్శి వరకు నిరంతరంగా పని చేశారు

● రూ.5,265 కోట్ల మేర తుపాను నష్టం అనేది ప్రాథమిక అంచనా

● తుఫాన్ ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాను వల్ల రాష్ట్రానికి రూ. 5,265 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, సీసీ కెమెరాల లాంటి సాంకేతికత వినియోగించి ఈ ప్రాథమిక నష్ట అంచనాలను రూపొందించామని వెల్లడించారు. మొంథా తుపాను ప్రభావంతో కలిగిన నష్టాన్ని కూడా టెక్నాలజీ సాయంతోనే తగ్గించినట్టు సీఎం స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఎం.. రాష్ట్రంపై తుపాను ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణ అంశాలపై విలేఖరులకు వివరించారు. వ్యవసాయ పంటలకు రూ. 829 కోట్లు, ఉద్యాన రంగంలో రూ. 39 కోట్లు, సెరీకల్చర్ రూ. 65 కోట్లు, ఆక్వా రంగంలో రూ. 1,270 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ. 2,079 కోట్లు, మున్సిపల్ శాఖలో రూ. 109 కోట్లు, జలవనరుల విభాగంలో రూ. 207 కోట్లు, పంచాయితీరాజ్ రూ. 8 కోట్లు, విద్యుత్ శాఖ రూ. 16 కోట్లు పశు సంవర్థక శాఖలో రూ. 71 లక్షలు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని వివరించారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారు చేసి కేంద్రానికి పంపిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ"సాంకేతిక పరిజ్ఞానంతో తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. అత్యంత ఖచ్చితత్వంతో

మిగతా 2లో...

## బీసీ హాస్టళ్లకు రూ.60 కోట్ల విడుదల



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస జయంతిని వచ్చే నెల ఎనిమిదో తేదీన రాష్ట్ర జయంతిగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర జయంతిని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించనున్నామని, ఈ ఉత్సవానికి మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ మేరకు గురువారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస తన కీర్తనలు, రచనలతో సమాజంలో అసమానతులపైనా, కుల వ్యవస్థపైనా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు కనకదాస చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. అటువంటి మహనీయుని జయంతిని రాష్ట్ర పండుగగా

మిగతా 2లో...

## నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేసామని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందనీ చెప్పారు. ఈ జిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లా పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలలో స్థానిక ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కుమార్ రాజాలతో కలిసి పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు... మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న కంద, అరటి, వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత మూలంగా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోగలిగాం.

మిగతా 2లో...

## యువతకు ఉద్యోగాల గేట్ వేగా 'నైపుణ్యం' పోర్టల్

● ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు

● నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు సహకారం

● శిక్షణ పూర్తయితే స్కిల్ టెస్టింగ్, ధృవపత్రాల జారీ

● ఆర్టీఐహెచ్‌తో విద్యార్థుల ఆవిష్కరణల అనుసంధానం

● నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు సహకరించేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్ వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 కల్లా 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

మిగతా 2లో...

## రియల్ టైమ్ మానిటరింగ్...

# రియల్ టైమ్ సొల్యూషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అపార అనుభవం ఉంది. తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి తుఫాన్ కదలికలను గమనించడం...ఆ మేరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం.. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవడమనే అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సాధారణంగా ఎప్పుడూ చేస్తూనే ఉంటారు. అయితే మొంథా తుఫాన్ విషయంలో కొంత భిన్నంగా వ్యవహరించారు. రాత్రింబవళ్లు పర్యవేక్షిస్తూనే ... టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించారు సీఎం చంద్రబాబు. ఆర్టీజీఎస్



కేంద్రం నుంచి రియల్ టైమ్ డేటాను అప్డేట్ చేసుకుంటూ... వచ్చిన సమాచారాన్ని విశ్లేషించుకుంటూ... రియల్ టైంలోనే సమస్యలను పరిష్కరించేలా పని చేశారు. డేటా డ్రివెన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ మోడల్ ఆవిష్కరించారు.

2లో...

## పంట నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ. 25 వేల పరిహారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, హెక్టార్‌కు రూ. 25 వేల వరకు పరిహారం అందించే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లెలోని మున్సిపల్ కార్యాలయంలో తుఫాన్ వరద ప్రభావంపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారని వెల్లడించారు.

మిగతా 2లో...

## ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల ప్రశంసలు

● గత 6 నెలల్లో వైద్య సిబ్బంది హాజరు, ఓపీ మరియు ఐపి సేవల్లో పురోగతి

● 42 నిమిషాల నుండి 26కు తగ్గిన ఓపీ సేవల సమయం

● నిరంతర పర్యవేక్షణ సత్ఫలితాలిస్తోందన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :**కూటమి ప్రభుత్వం జూన్ 2024లో అధికారంలోకొచ్చినప్పట్నించి ప్రభుత్వ వైద్య రంగాన్ని మెరుగుపరచడానికి చేపట్టిన ప్రయత్నాలు సానుకూల ఫలితాల్ని ఇస్తున్నాయని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)మొదటి 6 నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) ఈ దిశగా చేసిన ప్రయత్నాలు, మార్పులను ఉన్నతాధికారులతో మంత్రి సమగ్రంగా సమీక్షించారు.

3లో...



## బీసీ హాస్టళ్లకు రూ.60 కోట్ల విడుదల



(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించడం ఆనందకరమన్నారు. గతేడాది అనంతపురంలో భక్త కనకదాస రాష్ట్ర స్థాయి జయింతిని నిర్వహించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఈ ఏడాది అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో రాష్ట్ర స్థాయి భక్త కనకదాస జయంతిని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రెండ్రోజుల్లో కూటమి ప్రభుత్వం విడుదల చేయనుందని తెలిపారు. వచ్చే నెల ఎనిమిదో తేదీన అన్ని జిల్లాల్లోనూ భక్త కనకదాస జయంతి నిర్వహించేలా ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొననున్నట్లు వెల్లడించారు. ఈసారి కల్యాణదుర్గంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి భక్త కనకదాస జయంత్యోత్సవంలో మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారని మంత్రి సవిత తెలిపారు.

**సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు**

అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. గత ప్రభుత్వం బీసీ హాస్టళ్లను గాలికొదిలేసిందన్నారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించకపోగా, కనీసం హాస్టల్ మరమ్మతులకు కూడా రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. బీసీ బిడ్డల విద్యకు సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇప్పటికే హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంటిలో ఎంతమంది విద్యార్థులకు అందరికీ ఆ పథకాన్ని వర్తింపజేశామన్నారు. హాస్టళ్లలో భద్రతకు సీసీ కెమెరాలు, పరిశుద్ధమైన తాగునీటి కోసం వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామన్నారు. గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో విద్యార్థులకు ఫోన్ లో మాట్లాడే అవకాశం కల్పించామన్నారు. బీసీ హాస్టళ్ల నిర్మాణాలకు రూ.60 కోట్లు మంజూరు చేయడం ద్వారా సీఎం చంద్రబాబు బీసీ పక్షపాతి అని మరోసారి రుజువైందని ఆ ప్రకటనలో మంత్రి సవిత తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ. 25 వేల పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎదురైన మొంథా తుపాను ప్రభావాన్ని తగ్గించడానికి చేసిన కృషి ఒక చరిత్ర. గత ఆరు రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ మైక్రో లెవల్‌లో పరిస్థితిని పర్యవేక్షించారు. వారి కృషితోనే ప్రాణ, ఆస్తి నష్టాన్ని పెద్ద ఎత్తున నివారించగలిగాం. అనివార్య కారణాలతో ఇద్దరు మరణించడం బాధాకరం" అని అన్నారు.

తుపాను సహాయక చర్యల్లో కూటమి పార్టీల నేతలు బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాల్గొన్నారని, అయితే విపత్తు సమయంలో వైసీపీ నేతలు ఎక్కడా కనిపించలేదని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి బాధితులను పరామర్శించారని, కానీ గత ముఖ్యమంత్రి మాత్రం ఓ స్టేజీ ఏర్పాటు చేసి బాధితులను తన వద్దకే రప్పించుకున్నారని విమర్శించారు.

తుపాను వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారిని, మత్స్యకారులను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. మత్స్యకారులకు అదనపు సహాయం అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న సహాయం పట్ల ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## యువతకు ఉద్యోగాల గేట్ వేగా 'నైపుణ్యం' పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్ ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.

**క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేష్**

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని... స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేష్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరుల్ని అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని సీఎంకు వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా... నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ది పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా నైపుణ్యం పోర్టల్ తీర్చిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలని కోరుకుంటున్నారో... ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని సీఎం సూచించారు.

**అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం :** ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్ రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్ సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు. ఎక్కడ, ఏ రంగంలో శిక్షణ అందిస్తున్నాం, జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు.

**విదేశీ భాషల్ని నేర్చుకునేలా శిక్షణ :** 'పోర్టల్‌లో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు, వివిధ విద్యా సంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలి. విద్యా సంస్థలకు ఫ్యూచర్ ట్రెండ్స్ తెలిసేలా చేయాలి. ప్లేస్మెంట్ వివరాలనూ ట్రాకింగ్ చేసేలా ఉండాలి. స్కిల్ టెస్టింగ్‌కు కూడా అవకాశం కల్పించాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానించాలి. విదేశాల్లో ఉద్యాగావకాశాలు సులభంగా పొందేందుకు వీలుగా ఆయా దేశాల స్థానిక భాషలను నేర్చుకునేలా శిక్షణ అందించాలి. ఏపీ ఎన్ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఏపీలో యువత అందరికీ ఏ రంగంలో నైపుణ్యం కావాలో దానికి సంబంధించిన శిక్షణ... అలాగా ప్రస్తుతమున్న సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేలా పున:శిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి.' అని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

## మొంథా తుఫాన్.... పర్ఫెక్ట్ హ్యాండ్లింగ్



(మొదటి పేజీ తరువాయి)

ఒకవేళ సెల్ ఫోన్ సిగ్నల్ లేకపోతే శాటిలైట్ ద్వారా ఆ వ్యవస్థ పని చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చర్యల వల్ల గతంతో పోల్చితే ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస శిబిరాలకు తీసుకురావడం సులువైంది. సహజంగా లంక గ్రామాల ప్రజలు తమ ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడరు. తుఫాన్లు వచ్చినా...ఇళ్ల పైకప్పులపైకి ఎక్కుతారు. కానీ ప్రభుత్వం ముందుగానే అలెర్ట్ చేయడంతోపాటు... క్షేత్ర స్థాయి సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి వారికి నచ్చచెప్పి తుఫాన్ షెల్టర్లకు తీసుకొచ్చింది. దీంతో ప్రాణ నష్టానికి స్థానం లేకుండా చేయగలగింది. ఇక టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మరోసారి రుజువైంది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని డ్రోన్ల ద్వారా గుర్తించి పోలీసులు, అధికారుల బృందం అతణ్ని రక్షించింది. అలాగే ప్రభుత్వం వద్ద ఉన్న అలెర్ట్ మెకానిజం ద్వారా త్వరగా రెస్పాండ్ కావడం వల్లే బాపట్ల జిల్లాలోనే ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లి చిక్కుకుపోయిన 15 మందిని రెస్క్యూ ఆపరేషన్ చేసి కాపాడారు. ఈ విషయంలో ఏ మాత్రం అలక్ష్యం వహించినా.. వారి ప్రాణాలు దక్కేవి కాదు. ఇక గర్భిణులు, దివ్యాంగుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. టెక్నాలజీతో పాటు...ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా హ్యాండిల్ చేయాలనే అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న అనుభవం బాగా కలిసి వచ్చింది.

**లైవ్ ట్రాకింగ్, రియల్ టైం సొల్యూషన్స్ :** ఇక పంటలకు నష్టం వాటిల్లకుండా కూడా ప్రభుత్వం వీలైనంత మేరకు జాగ్రత్తలు తీసుకుంది. తుఫాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించే అంశాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా చేయడం ద్వారా వీలైనంత మేర పంట నష్టం తగ్గించే ప్రయత్నం చేసింది ప్రభుత్వం. ఇక డ్రైన్లు కూడా క్లీనప్ చేయడంతో... నగరాల్లో కూడా నీటినిల్వ లేకుండా చూడడంలో అధికార యంత్రాంగం సక్సెస్ అయింది. ఇక తుఫాన్ గాలులకు చెట్లు పడిపోయినా.. విద్యుత్ స్థంభాలు పడిపోయినా, వైర్లు తెగిపడినా వాటి కారణంగా ట్రాఫిక్ జాం కాకుండా, ప్రమాదాలు జరగకుండా.. వెంటనే వాటిని తొలగించడంతోపాటు.. విద్యుత్ వ్యవస్థను అతి తక్కువ సమయంలోనే పునరుద్ధరించారు. దీనికోసం అవసరమైన సామాగ్రి, వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. వేలకొద్ది యంత్రాలను.. వాహనాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకున్నారు. ఇక సహాయక చర్యల నిమిత్తం జేసీబీలను కూడా భారీ ఎత్తున సిద్ధం చేసుకుంది. వాటికి లైవ్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన మేరకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగింది. గతంలో వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా.. బోట్లు కొట్టుకురావడం.. బ్యారేజీల గేట్లకు బలంగా తాకడం వంటివి జరిగేవి. కానీ ఈసారి అలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంట్లో భాగంగానే... నెల్లూరు జిల్లా కలెక్టర్ తనకు అందిన సమాచారంతో అలెర్ట్ కావడంతో భారీ బోటును చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లేకుంటే సంగం బ్యారేజీకి ఆ బోట్లు ఢీ కొట్టి..ప్రమాదం ఏర్పడేది. ఇవన్నీ ముందు జాగ్రత్తలు తీసుకోవడం, అలెర్ట్ మెకానిజం ఉండడం వల్ల తప్పిన ప్రమాదాలే. ఇక కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా నిరంతరం పర్యవేక్షించడంతోపాటు... గండ్లు పడితే వాటిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు అవసరమైన ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. అలాగే రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీ సెంటర్ ద్వారా వచ్చిన ఆదేశాలు గ్రామ సచివాలయ స్థాయిలో వెంటనే అమలు చేయగలిగేలా విజయవంతంగా ప్రభుత్వం పని చేసింది.

**త్వరితగతిన నష్టపరిహారం అందచేయడం... నష్టం అంచనాల రూపొందించడం :** ఇక పునరావాస శిబిరాలను ముందుగానే సిద్ధం చేశారు. ఎప్పుడు అవసరమైతే.. అప్పుడు సహాయ శిబిరాలను హడావుడిగా ఏర్పాటు చేసుకునే పరిస్థితికి స్వస్తి చెప్పాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి పునరావాస శిబిరాలను సిద్ధం చేసుకోవాలని చెప్పడమే కాకుండా.. వాటిని అమల్లో పెట్టేలా చేశారు సీఎం. బాధితులకు ఆహారం, వసతి కల్పించడంతోపాటు.. కావాల్సిన మందులను కూడా పునరావాసంలో అందుబాటులో ఉంచారు. ఇలాంటి ఏర్పాట్లను సిద్ధం చేయడంతోపాటు.. పునరావాస కేంద్రాల్లోని పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే వైద్య బృందాలను సిద్ధం చేశారు. బాధితులకు అందించే నిత్యావసర వస్తువులను.. ఆర్థిక సాయాన్ని కూడా ముందుగానే ప్రభుత్వం సిద్ధం చేసుకుంది.

ఇక పునరావాస శిబిరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... తుఫాన్ వెలిశాక.. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇక పంటనష్టం అంచనాలను కూడా త్వరితగతిన వేసి..కేంద్రానికి వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించే వరకు పూర్తి స్థాయిలో ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం వ్యవహరించింది.

## యుద్ధ ప్రాతిపదికన పంటనష్టం అంచనా... పరిహారం చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 274 కిలోమీటర్ల మేర రహదారులు తుపాను దాటికి దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దెబ్బతిన్న అన్ని రోడ్లను శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించాం. పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడంతోపాటు అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో సూపర్ శానిటేషన్.. సూపర్ క్లోరినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. జిల్లాల వారీగా పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా విభజించి పారిశుద్ధ్య మెరుగు పర్చే చర్యలు మొదలు పెట్టాం. 1,583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితం కాగా, మొత్తం 21,055 మంది సిబ్బందిని పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్నాం. తాగునీటి సరఫరా వ్యవస్థకు ఇబ్బంది ఏర్పటిన చోట్ల ప్రయత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.



ఇళ్లకు వెళ్లే ముందే ఆర్థిక సాయం : మొంథా ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాల్లో ఉన్న వారికి 25 కేజీల బియ్యాన్ని, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం ఇవ్వాలని నిర్ణయించాం. కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్ ప్యాకెట్, కేజీ ఉల్లిపాయలు, 1 కిలో బంగాళాదుంపలు, కేజీ పంచదార కూడా కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. శిబిరాల్లో ఉన్న వారికి ఇళ్లకు వెళ్లే ముందే ఒక్కొక్కరికీ రూ. వెయ్యి చొప్పున ఇస్తున్నాం. ఒక్కో కుటుంబానికీ గరిష్టంగా రూ. 3 వేలు చెల్లించనున్నాం. తుపాను వల్ల సంభవించిన నష్టంపై ప్రాథమిక నివేదిక రాగానే కేంద్ర సహకారం కోరుతాం. కోడూరు మండల పరిధిలో సముద్రం కట్టపై దెబ్బ తిన్న అవుట్ ఫాల్ స్లూయిజ్ కొత్తగా నిర్మించడానికి నాబార్డ్ సాయం తీసుకుంటాం. ఎదురుమొండి దీవుల్లో సముద్ర కోతకు గురై దెబ్బ తిన్న ఎదురుమొండి – గొల్లమంద రహదారి నిర్మాణానికి రూ.13.08 కోట్ల కేటాయించామని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యిందని, దీని ద్వారా ఐదు గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయని" అన్నారు.

ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కృష్ణా జిల్లా స్పెషల్ ఆఫీసర్, టూరిజం శాఖ ఎండీ ఆమ్రపాలి, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టెక్నాలజీ సాయంతో తుపాను నష్టం తగ్గించాం

**(మొదటి పేజీ తరువాయి)** ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్చరికల్ని చేరవేయగలిగాం. టెక్నాలజీ సాయంతో తుఫాన్ ప్రభావం వల్ల కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించకలిగాం. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేశాయి. మొదటి రోజునే పరిస్థితులను చాలా వరకూ చక్కదిద్దాం. ఎప్పటికప్పుడు తుఫాన్ ప్రభావంపై సమీక్షలు నిర్వహించాం. అంతర్వేదికి సమీపంలో తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. శాటిలైట్ ఇమేజ్ ల ఆధారంగా తుఫాన్ పరిస్థితిని అంచనా వేశాం. సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలతో ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన నష్టాన్ని బాగా తగ్గించాం. వర్షాలు, గాలుల తీవ్రతను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి చర్యలు తీసుకున్నాం. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంది. తుఫాను ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాల్లో టెక్నాలజీ ద్వారా నష్టాలను తగ్గించాం. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎక్కడెక్కడ ప్రవాహాలు పెద్ద ఎత్తున వస్తాయనేది అంచనా వేసి ముందస్తుగా హెచ్చరికలు ఇచ్చాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ఓ మాన్యువల్ :** "మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకూ, లైన్ డిపార్టుమెంట్ల నుంచి గ్రామ వార్డు సచివాలయం వరకూ ఉద్యోగులు, సిబ్బంది తుపాను నష్టాల తీవ్రతను తగ్గించటంలో కృషి చేశారు. ఆర్టీజీఎస్ నుంచి మంత్రులు లోకేష్, అనితలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయికి ఆదేశాలు జారీ చేశారు. అంతా కలిసి సమష్టిగా పని చేయబట్టే ఇది సాధ్యమైంది. వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా.. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. రియల్ టైమ్ లోనే డేటా లేక్ ద్వారా సమాచారం విశ్లేషించి త్వరగా నిర్ణయాలు తీసుకోగలిగాం.

టెక్నాలజీ వినియోగించి పంట నష్టాలు, ముంపు ప్రాంతాలు తదితర అంశాలను కూడా గుర్తించాం. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ మనుషులు.. ఫేక్ పోస్టులు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టు ఉంది. తుపాను కారణంగా నెల్లూరు నుంచి విశాఖ వరకూ భారీ వర్షాలు కురిసినా రాయలసీమలో కొన్ని చోట్ల వర్షాలు పడలేదు. వర్షాభావంతో కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 37 కరవు మండలాలుగా ప్రకటిస్తున్నాం. ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కునేందుకు మొంథా తుపాను అనుభవాన్ని ఓ మాన్యువల్ గా రూపొందిస్తాం. టెక్నాలజీ వినియోగం ప్రజా ప్రయోజనాల కోసమే" అని ముఖ్యమంత్రి అన్నారు.

## నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

పక్కా ప్రణాళికతో నష్టం తీవ్రతను తగ్గించాం. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపు కారణంగానే తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వీడియో కాన్ఫరెన్సులు, ఆర్టీజీఎస్ ద్వారా 24 గంటలు పరిస్థితులను పర్యవేక్షిస్తూ.. అటు యంత్రాంగాన్ని, ఇటు గ్రామ స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేశాం. ఈ విపత్తులో కౌలు రైతులు కూడా నష్టపోయారు, వారిని కూడా ఆదుకుంటాం అని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన రంగంలో రూ.39 కోట్లు, సెరీకల్చర్ రూ.65 కోట్లు, ఆక్వా రంగంలో రూ.1,270 కోట్లు, పశుసంవర్ధక శాఖలో రూ.71 లక్షలు నష్టం వాటిల్లిందని మంత్రి తెలిపారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని వివరించారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారు చేసి కేంద్రానికి పంపిస్తామని స్పష్టం చేశారు. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని అన్నారు.



**రైతులకు తగిన న్యాయం చేస్తాం:** తుఫాన్ ప్రభావంతో చేతికొచ్చిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వరి, వాణిజ్య పంటలు విస్తృతంగా నష్టపోయాయని పేర్కొన్నారు. రైతులకు తగిన న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. వ్యవసాయ, హార్టికల్చర్ శాస్త్రవేత్తలను రంగంలోకి దించి, మిగిలిన పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయి సర్వే పూర్తవుతుందని, కేంద్రం సహకారంతో రైతులకు తగిన నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో 20 వేల రూపాయల నష్టపరిహారాన్ని 17 వేల రూపాయలకు తగ్గించిందని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ నష్టపరిహారాన్ని 20 వేల నుండి 25 వేల రూపాయలకు పెంచామని గుర్తుచేశారు. కేంద్రం నిర్ణయించిన దానికంటే అధికంగా పరిహారం అందజేస్తున్నామని చెప్పారు. రైతులు మళ్లీ పంటలు వేసేందుకు సిద్ధమైతే విత్తనాలను ప్రభుత్వం అందజేయడానికి సిద్ధంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 95 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, మిగిలిన 5 శాతం కూడా నవంబర్ 12 లోపు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలనే సంకల్పంతో ఉన్నామని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలను న్యాయబద్ధంగా నమోదు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనలతోనే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామనీ, కాని పంట నష్టం జరిగినదని తెలిపారు. బుడమేరు వరద బాధితులకు 15 రోజుల్లో పరిహారం అందజేశామని, రైతుల పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**జగన్ బహిరంగ చర్చకు రావాలి :** జగన్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే వ్యవసాయశాఖ తీసుకున్న అభివృద్ధి చర్యలు, కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మంత్రి అచ్చెన్నాయుడు సవాలు విసిరారు. గతంలో విపత్తులు వచ్చినప్పుడు వైసీపీ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తిలా కాకుండా, అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వాటా భీమా నగదును చెల్లించలేదని స్వయంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి పార్లమెంట్‌లో వెల్లడి చేశారని గుర్తు చేశారు. ఇది జగన్ పాలన ఎంత అసమర్థమో చూపించే నిదర్శనమని ఎద్దేవా చేశారు. వైసీపీ మాటలు తప్ప రైతులకు మేలు చేసిన పని ఏదీ లేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో కూర్చొని వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడటం కాదని క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు.

## రియల్ టైమ్ మానిటరింగ్... రియల్ టైమ్ సొల్యూషన్

(మొదటి పేజీ తరువాయి)

ఇంటిగ్రేటెడ్ ప్లానింగ్, టెక్నాలజీని అనుసంధానించి రియల్ టైమ్ లో సమన్వయం చేసుకోవడం.. నిర్ణయాలు తీసుకోవడం.. అవి అమలు అయ్యేలా చూసుకోవడంలో ఈ మోడల్ సక్సెస్ సాధించింది. సాంప్రదాయ పద్ధతులను అనుసరించడంతోపాటు.. వివిధ శాఖల నుంచి ఆర్టీజీఎస్ సెంటర్ కు వచ్చిన సమాచారాన్ని అనుసంధానించి %ూ౩ూ=జు% 2.0 వ్యవస్థ ద్వారా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు తీసుకోవడం.. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగింది ప్రభుత్వం. టెక్నాలజీ ద్వారా మొంథా తుఫాన్ సహాయక చర్యలను ఏ విధంగా మానిటర్ చేశారనే వివరాలను ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ మీడియాకు వివరించారు. సీఎం చంద్రబాబు తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి తొమ్మిది సార్లు టెలీ కాన్ఫరెన్సులు, ఆర్టీజీ సెంటర్ నుంచి నిరంతరం సమీక్షా సమావేశాలు చేపట్టారు. అలాగే వివిధ విభాగాలు, క్షేత్ర స్థాయి అధికారులతో నిరంతరం టచ్ లో ఉన్నారు. %=ు+ూ% కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన లైవ్ డేటాతో, అవసరమైన ప్రాంతాలకు సహాయక చర్యలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి... అమలు చేసేలా ప్రభుత్వం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించింది. అవసరమైన చోట యంత్రపరికరాలను, మానవ వనరుల్ని సమర్థంగా కేటాయించటంలోనూ టెక్నాలజీనే సాయపడింది.

టెక్నాలజి వనరుగా అవేర్ 2.0 :అవేర్ 2.0 వ్యవస్థకు స్టేట్ డేటాలేక్ ద్వారా అన్ని విభాగాలను అనుసంధానం చేశారు. దీని ద్వారా రియల్ టైములో నిర్ణయాలు తీసుకోవడానికి వీలు ఉంటుంది. వర్షపాతం, గాలి, పిడుగుల వంటి వాటిపై హెచ్చరికలు చేసేలా అవేర్-2.0 వ్యవస్థ పని చేస్తుంది. ఈ వ్యవస్థ ద్వారా విపత్తు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చు. అలాగే రిజర్వాయర్ స్థాయిలు, ఇన్‌ఫ్లోలు, భూగర్భ జలాలు చెరువులకు సంబంధించిన రియల్ టైమ్ డేటా అందుబాటులో ఉంటుంది. దీంతో శాటిలైట్ ద్వారా వివిధ ప్రమాదాలకు సంబంధించిన హెచ్చరికలు జారీ చేసే అవకాశముంది. అవేర్-2.0 వ్యవస్థ ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరించుకుని...ఏఐ ద్వారా విశ్లేషించి మొంథా తుఫాన్ కదలికలను కచ్చితంగా తెలుసుకోగలిగింది రాష్ట్రప్రభుత్వం. తద్వారా సహాయక చర్యలనూ వేగంగా చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ ద్వారా 72 గంటల ముందే తుఫాన్ కదలికల్లో వచ్చిన మార్పులను గుర్తించగలిగారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోగలిగారు.. అలాగే ఆయా ప్రాంతాల్లోని ప్రజలనూ అలెర్ట్ చేయగలిగారు. గాలుల వేగాన్ని అంచనా విషయంలో ఖచ్చితమైన సమాచారం రావడంతో... ఆయా ప్రాంతాల్లో ముందస్తుగానే చర్యలు తీసుకోవడానికి ఆస్కారం లభించింది. దీని ద్వారా ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగింది ప్రభుత్వం.

**అలారంలా పని చేసిన అలెర్ట్ మెకానిజం :** ఇక వివిధ వ్యవస్థల ద్వారా రియల్ టైములో సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం... ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రజలకు కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలి. విపత్తులకు సంబంధించిన సమాచారం ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఈ విషయంలో ప్రభుత్వం టెక్నాలజీని పూర్తిగా వినియోగించుకుంది. వాస్తవాలను ప్రజలకు నేరుగా చేరవేయగలిగింది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అధికారులకు 1.1 కోట్లకు పైగా సందేశాలను ప్రభుత్వం పంపింది. ఫిర్యాదులు స్వీకరించడం.. ఫీడ్ బ్యాక్ తీసుకోవడానికి కూడా ప్రత్యేక వ్యవస్థలు పని చేశాయి. మనమిత్ర సుమారు 12,000కు పైగా ఫిర్యాదులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో ఉన్న ప్రభుత్వ యంత్రాంగం పరిష్కరించింది. IVRS సర్వేలు, మీడియా, సోషల్-మీడియా మానిటరింగ్ ద్వారా అధికారులు ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఇదే సమయంలో తప్పుడు సమాచారం వ్యాప్తిని నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**డ్రోన్‌లు, సీసీటీవీ, వాహనాల లైవ్ ట్రాకింగ్ :** ఏరియల్ సర్వేలు, వరద మ్యాపింగ్, రియల్ టైమ్ డేటా సేకరణ కోసం 602 డ్రోన్‌లను అందుబాటులో ఉంచారు. 14,770 సీసీటీవీ కెమెరాలను RTGS నెట్‌వర్క్‌కు అనుసంధానించారు. 24 గంటల పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను అంచనా వేయగలిగారు. అలాగే ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే.. వాటిని త్వరగా గుర్తించగలిగారు. ఇక మెషినరీ ట్రాకింగ్ యాప్ ద్వారా JCBలు, క్రేన్‌లను లైవ్ ట్రాక్ చేయడానికి వీలు కలిగింది. అలాగే రోడ్‌బ్లాక్‌లు, వరద ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు ఉన్న చోట జేసీబీలు, క్రేన్లను తరలించేలా చర్యలు తీసుకోగలిగారు. ఇక అన్ని విభాగాల నుంచి వచ్చిన లైవ్ డేటాను అనుసంధానిస్తూ... సైక్లోన్ మానిటరింగ్ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ GIS మ్యాపింగ్ ద్వారా రోడ్లు, ఆసుపత్రులు, సహాయక కేంద్రాలు కీలకమైన మౌలిక సదుపాయాలు ఎక్కడున్నాయనే సమాచారాన్ని సేకరించగలిగారు.

**గ్రౌండ్ నెట్ వర్క్... గ్రౌండ్ రియాల్టీ...:** 5,803 గ్రామ, వార్డు స్థాయిలో కూడా కమాండ్ సెంటర్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగింది. క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా 2 కోట్లకు పైగా ప్రజలకు సేవలందించే ఏర్పాట్లను ముందుగానే చేసుకోగలిగింది. ఈ క్షేత్ర స్థాయి వ్యవస్థ ద్వారా బ్యాకప్ పవర్, సహాయక సామాగ్రిని ఆయా కేంద్రాల్లో ముందుగానే ఉంచారు. ముఖ్యంగా 1,742 మంది గర్భిణిలను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంలో గ్రౌండ్ లెవల్ నెట్ వర్క్ బాగా ఉపయోగపడింది.

తుఫాను అంతటా అంతర్-ఏజెన్సీ సమన్వయాన్ని బలోపేతం చేస్తూ, ఒక బలమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కొనసాగింది. 2,973 పోర్టబుల్ వైర్‌లెస్ సెట్‌లు, DG సెట్‌లు మౌంటెడ్ రేడియోలతో ఆర్టీజీ సెంటర్ నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఉంది.

**కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం...:** ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, IMD, NDMA, MHAలతో నిరంతరం కో-ఆర్డినేట్ చేసుకుంటూ ఆర్టీజీఎస్ సహా ఇతర విభాగాలు పని చేశాయి. NDRF, SDRF బృందాలు నెల్లూరులోని సంగం బ్యారేజ్ సమీపంలో చిక్కుకున్న పడవను చాకచక్యంగా లాగడం వంటి క్లిష్టమైన రెస్క్యూ మిషన్లను చేపట్టాయి. భారతదేశంలో మొట్టమొదటిదైన NDMA సెల్ బ్రాడ్‌కాస్ట్ వైబ్రేషనల్ అలర్ట్ సేవను మన రాష్ట్రం వినియోగించుకుంది. ఎనర్జీ డిపార్ట్‌మెంట్ ఫీడర్‌లు సబ్‌స్టేషన్‌లను రియల్ టైములో పర్యవేక్షణ చేశారు. శాటిలైట్ చిత్రాల సాయంతో ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు.

## అన్న క్యాంటీన్లను పరిశీలించిన నగర కమిషనర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా.బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ గురువారం పల్నాడు బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని పరిశీలించి, భోజనం చేసి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్ల పరిసరాల్లో ఆహారం తీసుకునే వారికి ఇబ్బంది లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా, మౌలిక వసతులు కల్పించేలా పర్యవేక్షణ కోసం వార్డ్ సచివాలయ కార్యదర్శులను కేటాయించామని, వారు నిర్దేశిత సమయంలో క్యాంటీన్లో ఉండాలన్నారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధానంగా త్రాగునీరు, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అభివృద్ధిపనులకు భూమిపూజ



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఇస్తున్న ప్రాధాన్యత క్రమంలో, కౌన్సిల్ ఆమోదం పొందిన, ,కోటి 12 లక్షల 86 వేల, సాధారణ నిధులతొ,వివిధ వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక భూమి పూజ చేసారు.


పట్టణంలోని 16,17,20,24,25వార్డులలొ చేపట్టె అభివృద్ధి పనులకు గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక భూమి పూజ చేశారు. తొలుత 16,వ, వార్డులొ కల్వర్ట్ నిర్మాణ పనులకు, చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, వార్డు కౌన్సిలర్ దీవి అనిత,భూమి పూజ చేశారు. అనంతరం 17వార్డులొ, సిసి రోడ్, సిసి కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక మీడియాతో మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా, కౌన్సిల్ ఆమోదం పొందిన, వర్కులను, ఆయా వార్డుల అవసరాలకు అనుగుణంగా ప్రారంభించడం జరిగిందన్నారు. వీటిలో సిసి రోడ్లు సిసి కాలువలు, కల్వర్టులు ఉన్నాయని, నాణ్యత ప్రమాణాలతొ,పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. 17వ వార్డు కౌన్సిలర్ అన్నం పిన్నారావు మాట్లాడుతూ తమ వార్డులు సీసీ రోడ్డు, సిసి కాలువ నిర్మాణానికి, తోడ్పడిన ప్రజా ప్రతినిధులకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు డిఇఇ ఎ. శ్రీనివాసరావు, ఎఇ సూరిబాబు, ఆయా వార్డు కౌన్సిలర్లు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

## నేడు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాక

**ఉమ్మడి గుంటూరు జిల్లా.బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జరిగే "సర్దార్ ఏ150" యూనిటీ మార్చ్" ర్యాలీలో పాల్గొంటారు. అనంతరం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయానికి వెళతారు.

ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ సమైక్య దినోత్సవం) ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రభుత్వ మహిళా కళాశాల వరకు సాగుతుందని తెలిపారు.

## ప్రతి రైతును ఆదుకుంటాం: గాదె



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండల పరిధిలోని అప్పాపురం గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతాంగం వెంకటేశ్వరరావు తో మాట్లాడుతూ ఇక్కడ ఉన్న డ్రైన్ వ్యవస్థ వల్లనే నిరంతరం పొలాలు దెబ్బతింటున్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపితేనే తాము వ్యవసాయం చేసుకోగలమని కోరారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం నష్టపోవడం వలన వ్యవసాయం చేసే పరిస్థితి లేదని తమకు శాశ్వత పరిష్కారం చూపించవలసిందిగా కోరారు. అలాగే దెబ్బతిన్న పంటకు వీలైనంత త్వరగా నష్ట పరిహారం ఇప్పించవలసిందిగా కోరుతున్నామని తెలియజేశారు. తదనంతరం గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రైతును ఆదుకుంటామని, ఎవరు అధైర్య పడద్దని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు, ప్రతి ఎకరాకి నష్టపరిహారం అందే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే అప్పాపురం దగ్గర నల్లమడ డ్రైన్ మరియు కృష్ణ కాలవలు నీటి ఎద్దడి తట్టుకోలేక ఊర్లో ఉన్న పొలాల మీదకు నీరు వచ్చే విషయానికి కేంద్ర మంత్రి మరియు స్థానిక ఎమ్మెల్యే తో మాట్లాడి, అదేవిధంగా అవసరమైతే అధిష్టానం దృష్టికి కూడా తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, కాకమాను మండల అధ్యక్షులు గడ్డం శ్రీనివాసరావు, అప్పాపురం గ్రామ అధ్యక్షులు పిచ్చయ్య , మండల నాయకులు పూర్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ శాఖల పనితీరు, పథకాల అమలుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని తెప్పించుకున్న మంత్రి అనుకూల, ప్రతికూల అంశాల్ని నిశితంగా గమనించారు.

గతేడాది అధికారంలోకొచ్చిన వెంటనే వైద్యారోగ్య రంగంలో నెలకొన్న పరిస్థితుల్ని గమనించి, ప్రభుత్వం చేపట్టిన దిద్దుబాటు చర్యల ఫలితాలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతరం పర్యవేక్షణతో వ్యవస్థలో జవాబుదారితనం కోసం చేసిన కృషి మంచి ఫలితాల్ని ఇవ్వడం పట్ల ఒక ప్రకటనలో మంత్రి హర్షాన్ని వ్యక్తం చేశారు. అయితే వ్యవస్థ పూర్తి ప్రక్షాళన కోసం చేయాల్సినది ఇంకా చాలా ఉందని, ఈ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అన్నారు.

వైద్య సిబ్బంది హాజరు, ఓపీ మరియు ఐపి సేవల్లో పురోగతి, డయాగ్నొస్టిక్ సేవల రాశిలో ప్రగతి, ఆరోగ్య పథకాల అమలులో వచ్చిన మార్పు ఆశాజనకంగా ఉన్నాయని మంత్రి అన్నారు.

**మొదటిసారిగా మూల్యాంకన వ్యవస్థ :** అధికారంలోకొచ్చినప్పట్నించి గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా సంక్రమించిన లోపాలు, సమస్యలను సవరించడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టి పెట్టారు. క్రమశిక్షణారాహిత్యం, జవాబుదారితనం లోపించడంపై ఆందోళన చెందిన మంత్రి మార్పుకోసం వివిధ విభాగాల పనితీరు, పథకాల అమలు మదింపు కోసం ఒక పటిష్టమైన, సమగ్రమైన మూల్యాంకన వ్యవస్థను గతేడాది నవంబరులో ప్రవేశపెట్టారు. దీని ఆధారంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలల కాలంలో వివిధ జిల్లాల పనితీరు, పథకాల అమలు, డివిజన్లకు ర్యాంకులివ్వాలని మంత్రి ఆదేశించారు. ఈ మూల్యాంకనం ఆధారంగా వాటిని మంత్రి సమీక్షించారు.




**వైద్య సిబ్బంది హాజరు :** ఈ 6 నెలల కాలంలో ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు ఈ ఏడాది ఏప్రిల్‌లో 83 శాతం నుంచి సెప్టెంబరు నాటికి 92 శాతానికి పెరిగినట్లు గమనించిన మంత్రి హర్షాన్ని వెలిబుచ్చారు. ఈ కాలంలో సగటు హాజరు 87 శాతంగా నమోదైంది. నర్సులు, పారా మెడికల్ సిబ్బంది హాజరు 90 శాతానికి పైగా ఉండగా...వైద్యుల హాజరు 82 శాతం మాత్రమే ఉండటాన్ని గమనించిన మంత్రి తగు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల్ని ఆదేశించారు.

**జిజిహెచ్‌లలో హాజరు :** డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరులో విశాఖపట్నంలోని కెజిహెచ్( 93.13 శాతం) , కర్నూలు జిజిహెచ్( 92.71 శాతం), రాజమహేంద్రవరం జిజిహెచ్(91.46 శాతం) హాజరుతో అగ్రస్థానంలో నిలిచాయి. తక్కువ హాజరు నమోదైన జిజిహెచ్‌లుఃనెల్లూరు జిజిహెచ్(66.44 శాతం), ఏలూరు జిజిహెచ్(76.30 శాతం), గుంటూరు జిజిహెచ్(77.84 శాతం). హాజరు విషయంలో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీ (100 శాతం), కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్(99.92 శాతం), విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ (95.30 శాతం)తో ముందు వరుసలో ఉన్నాయి. దాదాపు 80 శాతం హజరుతో విజయవాడలోని సిద్దార్థ మెడికల్ కాలేజీ, శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాల మరియు గుంటూరు జిఎంసి వెనుకబడ్డాయి. కొత్తగా స్థాపించిన 6 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో హాజరుపై దృష్టి పెట్టాలని మంత్రి అన్నారు. డిఎంఇ మరియు అనుబంధ సంస్థలు, నర్సింగ్ కళాశాలల్లో హాజరు తక్కువగా ఉండడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

**త్వరగా ఓపీ సేవలు :** ఈ 6 నెలల కాలంలో 20 శాతానికి పైగా వృద్ధితో ప్రభుత్వవైద్య శాలల్లో మొత్తం 4 కోట్లకు పైగా ఓపీ సేవలు అందించబడ్డాయి. ముఖ్యంగా ఓపీ సేవలందించడానికి ఇంతకుముందు సగటున రోగికి 42 నిమిషాలు పట్టగా ఈ సమీక్షా కాలంలో అది 26 నిమిషాలకు తగ్గడంపై మంత్రి సంతోషాన్ని వెలిబుచ్చారు. ఓపీ మరియు అభా రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఈ కాలంలో భారీగా పెంచడం వల్ల ఇది సాధ్యమైందని ఆయన గమనించారు. 2024లో జిజిహెచ్‌ల్లో కేవలం 80 ఓపీ కౌంటర్లు మాత్రమే ఉండగా ఈ ఏడాది సెప్టెంబరు నాటికి అవి 150కి పెరిగాయి. అభా కౌంటర్లు 53 నుండి 116కు పెరిగాయి.

ఈ సమీక్షా కాలంలో మొత్తం 2.50 కోట్ల మేరకు ఎక్స్ రే, అల్ట్రాసౌండ్, ఇసిజి మరియు ల్యాబ్ టెస్టులు చేయబడ్డాయి. ఈ విషయంలో 6.10 శాతం వృద్ధి నమోదైంది.

**జిల్లాల పనితీరు :** పలు నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) పథకాల అమలులో తూర్పు గోదావరి, కడప, తిరుపతి జిల్లాలు అగ్రస్థానంలో నిలవగా అల్లూరి సీతారామరాజు, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాలు వెనుకబడ్డాయి. డివిజన్ల పనితీరు ప్రకారం డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం, మాతా శిశు ఆరోగ్య విభాగం అగ్రస్థానంలో నిలవగా అసంక్రమణ వ్యాధుల విభాగం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బిఎస్కె) వెనుకబడినట్లు మంత్రి గమనించారు.

డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం కింద టిబి, కుష్టు, హెపటైటిస్, వ్యాధులు ప్రబలడంపై నిఘా, అంధత్వ నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ దిశగా సత్ఫలితాలను సాధించడంపై మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అసంక్రమిక వ్యాధులకు సంబంధించి భారీ స్థాయిలో స్క్రీనింగ్ జరుగుతున్నా ఈ వ్యాధులబారిన పడిన వారికి తగు చికిత్సలు అందించడంలో లోపం కనపడుతోందని, దీనిని సవరించాలని మంత్రి ఆదేశించారు.

మొదటిసారిగా చేపట్టిన మూల్యాంకన వ్యవస్థ ఫలితాల ఆధారంగా వెల్లడైన లోపాలను సరిదిద్దుకోడానికి తగు చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# తుఫాను నష్ట నివేదికలు అందజేయాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా.బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్)** :మొంథా తుఫాన్ వలన జరిగిన నష్టాన్ని ఎన్యూమరేషన్ చేసి తక్షణం నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మొంథా జిల్లా ప్రాంతీయ ప్రత్యేక అధికారి ఆర్.పి.సిసోడియా ఆదేశించారు.

గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వీడియో సమావేశ మందిరంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, నగర పాలక కమిషనర్ పులి శ్రీనివాసులు , సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి జిల్లా అధికారులతో మొంథా తుఫాన్ వలన కలిగిన నష్టం పై సమీక్షించారు. జిల్లాలో తుఫాన్ వలన ఆస్తి, పంట నష్టం, పశు నష్టం ,గృహాల నష్టం పై జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 22 వేల హెక్టార్ల లో పంట నష్టం అంచనాలపై శాస్త్రవేత్తల బృందంతో వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనలో ఉన్నారని వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. విద్యుత్ అధికారులు బుధవారం సాయంత్రానికి విద్యుత్ ని పునరుద్దరించడం జరిగిందని తెలిపారు. జిల్లా పంచాయితీ అధికారి బి.వి. నాగసాయి కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అన్నీ గ్రామాలలో శానిటేషన్ చేస్తున్నామని, సూపర్ క్లోరినేషన్ చేస్తున్నామని తెలిపారు. 228 ట్యాంకులను క్లోరినేషన్ చేయడం జరిగిందని, ఎక్కడైనా గ్రామాలలో నిల్వ వున్న నీటిని బయటకు పంపిస్తున్నామని తెలిపారు. పశు సంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ 18 మండలాలో తుఫాన్ పై విస్తృతంగా అవగాహన కల్పించడం పై పశు నష్టం ఎక్కువగా లేదని కొన్ని పశువులు చనిపోయిన వాటిని గురించి అధికారులకు తెలియజేయడం జరిగిందని అన్నారు. ఆర్.డబ్ల్యుఎస్ అధికారి మాట్లాడుతూ తుఫాన్ వలన డామేజ్ ఏమి లేదని ఎప్పటికప్పుడు నీటి నమూనాలు సేకరించి పరిక్షించడం జరుగుతుందని అన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగలేదని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ వర్షాల వలన కెనాల్స్ ఓవర్ ఫ్లో అయ్యాయని కెనాల్స్ కు , టాంకులకు ప్రమాదం లేదని కృష్ణ వెస్టన్ డెల్టాలో కొన్ని డ్రైన్స్ డామేజ్ అయ్యాయని వివరించారు.




ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మాట్లాడుతూ రైతులకు పంట నష్ట పరిహారం త్వరగా అందించేందుకు వ్యవసాయ అధికారులు త్వరితగతిన ఎన్యూమరేషన్ ను పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి తుఫాన్ నష్ట అంచనాలను సేకరించి నివేదికను త్వరిత గతిన అందజేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో వున్న వారికి ఇంటికి తిరిగి వెళ్ళే టప్పుడు ఒక వ్యక్తి అయితే వెయ్యి రూపాయలు , ముగ్గురు ఆ పై సభ్యులు గల కుటుంబానికి మూడు వేల రూపాయల చొప్పున చెల్లించాలని, తమకు డబ్బుతో పాటు బియ్యం, నూనె, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, పామ్ ఆయిల్ తో కూడిన కిట్టులను అందించాల్సివున్నదని, పునరావాస కేంద్రాలలో వున్న వారి వివరాలను నమోదు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె ఖజావలి, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ వి.జ్యోతి బసు, పశు సంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, డి.ఎం.అండ్ హెచ్ ఓ. డా. విజయలక్ష్మి, ఏ.పి.ఎం.ఐ.పి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్. వజ్రశ్రీ, హౌసింగ్ పి.డి ప్రసాద్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్.ఇ కె.కళ్యాణ్ చక్రవర్తి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి. చెన్నయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# తుపాన్ల లక్షణాలు మారిపోతున్నాయ్

- **గందరగోళానికి గురిచేసిన 'మొంథా'**
- **వేగంగా బలపడి, అంతే వేగంతో బలహీనపడిన మొంథా తుఫాన్**
- **వాతావరణ మార్పుల దృష్ట్యా కొత్త రకం తుఫాన్లు**



**ఉమ్మడి గుంటూరు జిల్లా.బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్)** :ఈశాన్య రుతుపవనాల కాలంలో ఏర్పడిన తొలి తీవ్ర తుపాను 'మొంథా' భారీ నష్టానికి దారి తీసింది. అయితే, ఈ తుపాను ప్రవర్తన వాతావరణ నిపుణులను, అధికారులను గందరగోళానికి గురిచేసింది. వాతావరణ మార్పుల ప్రభావంతో తుపాన్లు ఇప్పుడు తమ స్వభావాన్ని, గమనాన్ని, వేగాన్ని మార్చుకుంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. .

సాధారణంగా తుపాను తీరం దాటిన తర్వాత సమీప ప్రాంతాల్లో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తాయి. కానీ 'మొంథా' మాత్రం తీరం దాటిన కూడా అంత ప్రభావం చూపలేదు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు పశ్చిమ గోదావరి, ఏలూరు, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఎక్కడా 50 మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదు కాలేదు. కేవలం ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం వద్ద మాత్రమే కొంతమేర వర్షం పడింది.

**కావలి వద్దే బాగా కనిపించినమేఘాలు:**

సాధారణంగా తుపాను 'కన్ను' (ఐ)కు 40 నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో 'క్లౌడ్ వాల్స్' ఏర్పడి భారీ వర్షాలు పడి, ఈదురుగాలులు వీస్తాయి. అయితే 'మొంథా' తుపానులో ఇది పూర్తిగా విభిన్నంగా చోటు చేసుకుంది. తీరం దాటిన అంతర్వేది నుంచి దాదాపు 330 కిలోమీటర్ల దూరంలోని కావలి వద్దే మేఘాలు కేంద్రీకృతమై 20 సెం.మీ.లకు పైగా వర్షపాతం నమోదైంది. అంతర్వేది సమీపం, కోనసీమ జిల్లాలో మాత్రం చెప్పుకోదగ్గ వర్షాలు కురవలేదు. గాలుల వేగం కూడా తీవ్ర తుపానుకు తగినంతగా లేదు.

**వాతావరణ శాఖ అంచనాలకు భిన్నం.**

తుపాన్లు సాధారణంగా తీరం దాటిన ప్రాంతానికి కుడివైపు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా వర్షపాతం ఉంటుంది. ఈ లెక్కన అంతర్వేదికి కుడివైపున ఉన్న కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు కురవాలి. కానీ ఎక్కడా అలా జరగలేదు. విశాఖలో నమోదైన అధిక వర్షం తుపానుతో కాకుండా ద్రోణి ప్రభావంతోనే అని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**బలపడినంత వేగంగా 'మొంథా': తుఫాన్ బలహీన పడింది**

గత శుక్రవారం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం రూపంలో ప్రారంభమైన 'మొంథా', శనివారం ఉదయానికి వాయుగుండంగా, ఆదివారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా, రాత్రికి తుపానుగా మారింది. మంగళవారం నాటికి ఇది తీవ్రమైన తుపానుగా బలపడింది. కానీ తీరం దాటిన తర్వాత అదే వేగంతో బుధవారం తెల్లవారుజామున తుపానుగా, ఆపై తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. సముద్రంలో తుపాన్లు ఎక్కువ సమయం కొనసాగితే బలం పెరుగుతుందని నిపుణులు చెబుతారు. కానీ 'మొంథా' మాత్రం గంటకు 15 నుంచి 17 కి.మీ. వేగంతో కదిలి, తక్కువ సమయంలోనే బలహీనపడింది. దీని కారణంగా ఎక్కువగా ప్రభావం చూపలేకపోయింది. తుపాను తీరం దాటేటప్పుడు మచిలీపట్నంలో మాత్రమే 82 కి.మీ. వేగంతో గాలులు వీచినట్లు అధికారులు తెలిపారు.

**గమనం, లక్షణాల్లో మార్పు**

ఏ రెండు తుపాన్లు ఒకేలా ఉండవు. అయితే వాతావరణ మార్పుల ప్రభావంతో ఇప్పుడు తుపాన్ల లక్షణాలు వేగంగా మారుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. 'మొంథా' తుపాను ఏర్పడే వరకు బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తగిన విధంగా ఉన్నాయి. కానీ తర్వాత పరిస్థితులు అది బలం పుంజుకునేందుకు, ప్రభావం చూపేందుకు అనుకూలించలేదు. వాతావరణ మార్పుల దృష్ట్యా తుపాన్ల ప్రవర్తన మారిపోతోందని పలువురు వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

## రైతులకు అండగా నిలవండి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, వారికి అండగా నిలవాలని వైసిపి నేతలకు మాజీ సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయం నుండి పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో గురువారం ఉదయం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రైతులకు భరోసా లేకుండా చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో పక్కాగా ఉచిత పంటలబీమా అమలు చేశామని, 85 లక్షలమంది రైతులకు, 70 లక్షల ఎకరాల్లో ఉచిత ఇన్సూరెన్స్ ఇచ్చామని తెలిపారు. రైతుల తరుపున ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించిందని చెప్పారు. ఐదేళ్లలో 54.44 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్లు పరిహారం ఇచ్చామని చెప్పారు. ఇప్పుడు 19 లక్షల రైతులకే బీమా అందుతోందని, రుణాలు తీసుకున్న 19 లక్షల రైతులకే బ్యాంకులు బీమా కల్పించాయని, మిగిలిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రెండేళ్లుగా ఏ సీజన్లోనూ ప్రభుత్వం ప్రీమియం కట్టలేదని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయం దారుణంగా మారిందని అన్నారు. రైతులకు ప్రభుత్వం నుండి ఒక్క పథకమూ రావడం లేదని, ఇన్‌పుట్ సబ్సిడీ లేదని, అన్నదాత సుఖీభవ లోనూ మోసం చేశారని చెప్పారు. ఇ–క్రాప్‌కు మంగళం పాడారని, రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. పంటలకు గిట్టుబాటుధర లేక రైతాంగం తీవ్ర కష్టాల్లో ఉందని అన్నారు. అయినా టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. 16 నెలల్లో రైతులకు ఎప్పుడూ ఏదో ఒక కష్టం వస్తోందని తెలిపారు. మొంథా తుపాను విషయంలో ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుందని, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు సరిగా లేవని చెప్పారు. కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని, ఇప్పటికే కోటి సంతకాల కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నవంబరు 11న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని, కార్యకర్తలంతా చురుగ్గా పాల్గొనాలని జగన్ కోరారు.

## తుఫాను బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా.బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్)** :చేబ్రోలు తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు అందజేత . గురువారం మండలంలో 117 కుటుంబాల్లోని , 422 మందికి పంపిణీ చేశారు.

తహసీల్దార్ కే శ్రీనివాస శర్మ తెలిపారు . ఈ నిత్యవసరాలను ఆయా పంచాయితీ కార్యదర్శులు , గ్రామ రెవెన్యూ అధికారులకు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఇవ్వడం జరిగిందని చెప్పారు . మండలంలోని వీర నాయకుని పాయలం నిత్యవసరాలు పంపిణీలో పాల్గొని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మైలా వెంకట రామరాజు , ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ అందజేశారు . సందర్భముగా వారు మాట్లాడుతూ తుఫాన్ వలన బాధపడిన రిలీఫ్ కేంద్రాలలో తాత్కాలిక ఆశ్రమం పొందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని చెప్పారు. వ్యక్తిగతంగా ప్రతి వ్యక్తికి రూ 1000 చొప్పున , కుటుంబానికి రూ 3000 చెల్లింపు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు . ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం , కేజీ కందిపప్పు లీటరు మంచి నూనె, కేజీ ఉల్లిపాయలు , కేజీ ఆలుగడ్డలు , కేజీ చక్కెర , పంపిణీ చేసేందుకు ప్రభుతి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు . కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు గ్రామ రెవెన్యూ అధికారులు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు మంత్రి నారా లోకేష్ పర్యటన

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** శుక్రవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లి మండలం, కుంచనపల్లి లో శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణ దేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవము నకు రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ హాజరుకానున్నారు.



## జర్నలిస్టు మస్తాన్‌కు జర్నలిస్టు సంఘ నాయకులు చేయూత

- అండగా ఉంటాము జాతీయ నాయకులు మీరాహుస్సేన్ ఖాన్ భరోసా

**నందిగామ, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జర్నలిస్ట్ మస్తాన్ కి గతంలో గుండెకు బైపాస్ సర్జరీ జరిగినది. ప్రస్తుతం మస్తాన్ కొంత అస్వస్థతకు గురి కావడంతో నందిగామ అయన స్వగృహంలో జర్నలిస్టు సంఘ జాతీయ నాయకులు పి.మీరాహుస్సేన్ ఖాన్, జిల్లా నాయకులు అకుల వెంకటనారాయణ, పఠాన్ సైదాఖాన్,జర్నలిస్టులు హమీద్,అన్నవరపు చంద్రశేఖర్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘం తరుపున 5వేల రూపాయల నగదు, 25కేజీల బియ్యం,పండ్లను అందజేశారు.ఈ సందర్భంగా ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఏపిబిడబ్ల్యూజేఏ వ్యవస్థాపక అద్యక్షులు పి.మీరాహుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ జర్నలిస్ట్ మస్తాన్ త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పీ ఆర్ కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజ, స్వాములకు బిక్ష



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**

హనుమాన్ జంక్షన్, బాపులపాడు మండలం, అభయాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు అయ్యప్ప స్వామి పీఠం వద్ద %ూ=ఖ% ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారా రామకృష్ణ పూజా కార్యక్రమం, స్వాములకు బిక్ష నిర్వహించారు. అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమానికి వచ్చు మార్గంలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు పూజా కార్యక్రమం నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్న పిఆర్ కె ఫౌండేషన్ చైర్మన్ గన్నవరం పారా రామకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గన్నవరం బిజెపి నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు ,గన్నవరం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, శేష్ కుమార్, బాపులపాడు తెలుగుదేశం నాయకులు కొల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## శ్రేయోభిలాషి ముక్కామల సురేంద్రబాబు మృతి పట్ల బి.కె.ఆర్. సేవా సంస్థ తీవ్ర దిగ్భ్రాంతి

**గన్నవరం, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**



బి.కె.ఆర్. సేవా సంఘం,అమ్మ చిల్డ్రన్ హోమ్‌కి ఆత్మీయ శ్రేయోబిలాషి ,దాత అయిన ముక్కామల సురేంద్రబాబు మరణ వార్త పట్ల బీ కే ఆర్ సేవా సంస్థలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. కరోనా లాక్‌డౌన్ సమయం నుండి నేటి వరకు కూడా తమ ఆశ్రమాలకు నిరంతరం చేయూత అందిస్తూ ,అండగా నిలిచిన సురేంద్ర బాబు మరణం తమను,ఆశ్రమ వాసులందరి హృదయాలను కలచివేసిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. "మన ఆశ్రమాలకు అపారమైన సహాయం అందించిన ముక్కామల సురేంద్రబాబు మరణ వార్త విని మేము తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాము.ఆయన సేవలు,సహకారం మరువలేనివి.ఈ వార్త మమ్మల్ని,మా అందరి హృదయాలను కలిచివేసింది" అని బీ కే ఆర్ సేవా సంస్థలు తమ సంతాప సందేశంలో పేర్కొన్నాయి.సంస్థ తరపున వారు సురేంద్రబాబు పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని ఆ భగవంతుని మనస్పూర్తిగా ప్రార్థిస్తున్నామని తెలిపారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## తుపాను బాధితులకు వీఆర్వో సునీల్ కుమార్ దాతృత్వం

- నిత్యావసర సరుకుల పంపిణీ




**వీరవల్లి, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**

ముంథా తుపాను ప్రభావంతో నిరాశ్రయులైన నిరుపేద కుటుంబాలకు వీరవల్లి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) సునీల్ కుమార్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నాలుగు నిరుపేద ఎరుకుల కుటుంబాలకు 25 కిలోల సన్న బియ్యంతో పాటు, నిత్యావసర సరుకులను పంపిణీ చేసి తన మానవత్వాన్ని ప్రదర్శించారు.తుపాను హెచ్చరికల నేపథ్యంలో, చెరువు గట్టుపై నివాసం ఉంటున్న ఈ నాలుగు కుటుంబాలను అధికారులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వీరవల్లిలోని జడ్పీ హైస్కూల్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారి జీవన పరిస్థితి దుర్భరంగా ఉండటం, అందులోనూ పసిబిడ్డలు ఉండటాన్ని గమనించిన వీఆర్వో సునీల్ కుమార్ చలించిపోయారు.వెంటనే స్పందించి, తన సొంత ఖర్చులతో ఆ నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారు. సునీల్ కుమార్ చూపిన ఈ మానవత్వం, దాతృత్వంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులంతా ఇదే విధంగా స్పందిస్తే పేదలకు మరికొంత సాయం లభిస్తుందని వారు పేర్కొన్నారు.

# నష్టాల సత్వర అంచనాలకు డ్రోన్ సాంకేతికత

- మండలానికో ప్రత్యేక డ్రోన్ సర్వే బృందం
- తక్కువ సమయంలోనే కచ్చితమైన, పారదర్శక నివేదికల రూపకల్పనకు వీలు
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**

జిల్లాలోని మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంటలతో పాటు రహదారులు, వంతెనలు, ఇళ్లు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించి జరిగిన నష్టాన్ని వేగవంతంగా, కచ్చితంగా, అత్యంత పారదర్శకంగా అంచనా వేసేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)లో కలెక్టర్ లక్ష్మీశ.. తుపాను నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసేందుకు డ్రోన్ కార్పొరేషన్ ద్వారా తొలిగా అందుబాటులోకి వచ్చిన డ్రోన్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లా డుతూ తుపాను ప్రభావిత ప్రజలకు వీలైనంత




త్వరగా సహాయసహకారాలు అందించే లక్ష్యంతో నష్టాలను సత్వరం అంచనా వేసేందుకు ఆధునిక సాంకేతికత దోహదం చేస్తుందని.. జిల్లాలోని 20 మండలాల్లో నష్టాల అంచనాలకుగాను ఒక్కో మండలానికి ఒక డ్రోన్ టీమ్ పనిచేస్తోందని వివరించారు. సంప్రదాయ పద్ధతులతో పోల్చితే చాలా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలోని ప్రాంతాల్లో డ్రోన్ సాంకేతికత ద్వారా కచ్చితమైన ఆధారాలతో నష్టాలను అంచనా వేయొచ్చన్నారు. హై రిజల్యూషన్ ఇమేజరీ, ఫుటేజీ ద్వారా ఇది సాధ్యపడుతుందన్నారు. మనుషులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లోకి సైతం డ్రోన్లను పంపి.. అక్కడి పరిస్థితిని తెలుసుకొని నష్టాన్ని విశ్లేషించేందుకు డ్రోన్లు ఉపయోగ పడతాయ న్నారు. డిజిటల్ మ్యాపులు, ఫొటోలు, 3డీ నమూనాల రూపంలోనూ పంట నష్టం నివేదికలను రూపొందించి పారదర్శకతను పెంపొందించవచ్చన్నారు.

### పునరుద్ధరణ పనులకూ దోహదం

డ్రోన్ సాంకేతికత ద్వారా సేకరించిన డేటా ఆధారంగా పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులను సైతం సత్వరం చేపట్టేందుకు వీలుంటుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని త్వరగా, సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## గుంటూరు -పగిడిపల్లి & మోటమర్రి - విష్ణుపురం సెక్షన్ల మధ్య విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను

# మెరుగుపరచడానికి ఆమోదించిన రైల్వే మంత్రిత్వ శాఖ

- ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ. 188.31 కోట్లు వ్యయం అవుతుందని అంచనా

**విజయవాడ, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**

రైల్వే మంత్రిత్వ శాఖ గుంటూరు – పగిడిపల్లి & మోటమర్రి – విష్ణుపురం సెక్షన్ల మధ్య విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను మెరుగుపరచడానికి చేసిన ప్రతిపాదనను ఆమోదించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.188.31 కోట్లు. ప్రస్తుతం, 1X 25 కెవి సామర్థ్యంతో విద్యుత్ ట్రాక్షన్ అందుబాటులో నున్న ఈ వ్యవస్థను 2X 25కెవి విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థగా పెంపు చేసే ప్రతిపాదనను ఇప్పుడు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదించింది. విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను పునరాభి వృద్ధి చేయడంలో ప్రధానంగా సర్క్యూట్ బ్రేకర్ల మార్పు, స్విచ్చింగ్ స్టేషన్లు మరియు ప్రస్తుత వ్యవస్థలో అదనపు కండక్టర్లను వ్యవస్థాపించడం ఉంటాయి.కేంద్ర రైల్వే, సమాచార & ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రిఅశ్విని వైష్ణవ్ ఈ ప్రాజె క్టు మంజూరు సందర్భంగా ఈ విధంగా పేర్కొన్నారు" సికింద్రాబాద్ – విజయవాడ చాలారద్దీగా ఉండే రైల్వే మార్గం. పగిడిపల్లి –గుంటూరు మరియు విష్ణుపురం – మోటుమారి సెక్షన్ సికింద్రాబాద్‌మరియు విజయవాడ మధ్య ప్రత్యామ్నాయ మార్గంగా పనిచేస్తుంది. ఈ మార్గంలో మరిన్ని రైళ్లను నడపడానికి,పగిడిపల్లి–గుంటూరు మరియు విష్ణుపురం – మోటమర్రి సెక్షన్లో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ను 2X25 కెవి ట్రాక్షన్ సిస్టమ్ను మెరుగుపరచాలని రైల్వే నిర్ణయించింది. ఈ సెక్షన్ను రాబోయే 3 సంవత్సరాలలో రూ.188 కోట్లపెట్టుబడితో మెరుగుపరుస్తారు". ఈ ప్రాజెక్ట్ తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోకి



వస్తుంది. పగిడిపల్లి – గుంటూరు మరియు మోటమర్రి – విష్ణు పురం మధ్య మొత్తం ప్రాంతం దాదాపు 337 రూట్ కిలోమీటర్లు మరియు సింగిల్ లైన్ విభాగం. పగిడిపల్లి – గుంటూరు మధ్య ఉన్న ఈ విభాగం తెలంగాణ రాజధాని నగర ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర ప్రాంతం మరియు దేశంలోని తూర్పు ప్రాంతాలతో అనుసం ధానించే కీలకమైన ప్రాంతం. మోటమర్రి–విష్ణుపురం మధ్య ఉన్న విభాగం సరుకు రవాణాకు, ముఖ్యంగా బొగ్గు రవాణాకు చాలా ముఖ్యమైనది. ఈ కీలకమైన విభాగాల విద్యుదీకరణ మిషన్ విద్యుదీకరణలో భాగంగా పూర్తయింది మరియు ట్రాక్షన్ మార్పు అవసరం లేకుండా ప్యాసింజర్ మరియు సరుకు రవాణా రైళ్లు సజావుగా నడపడానికి సహాయపడింది. మెరుగుపరచబడిన ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ అధిక వోల్టే జ్తో విద్యుత్ సరఫరాను అందిస్తుంది తద్వారా అధిక వేగంతో మరియు ఎక్కువ సామర్థ్యంతో రైళ్లను నడపడా నికి సహాయపడుతుంది. మెరుగైన వోల్టేజ్ నియం త్రణతో, వోల్టేజ్ హెచ్చు తగ్గులు ఉండవు, రైళ్లకు స్థిరమైన వోల్టేజ్ను సులభతరం చేస్తాయి. ఈ 2 x 25 కె. వి విద్యుత్ వ్యవస్థలో సర్క్యూ ట్ లోపాలను అధిగ ˊమించి నిరంతర విద్యుత్ ఆపరేషన్ కూడా అందిస్తుంది. ట్రాక్షన్ సబ్ స్టేషన్ల అంతరాన్ని పెంచవచ్చు మరియు తద్వారా అవసరమైన సబ్‌స్టేషన్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఈ వ్యవస్థ ప్యాసింజర్ మరియు సరుకు రవాణా రైళ్లు రెండింటినీ మరింత సమర్థవంతంగా సజావుగా నడపడంలో సహాయపడుతుంది.

## ఉత్తమ గ్రామ స్వచ్ఛ అవార్డు, శానిటేషన్ లో జిల్లాలో

# మొదటి స్థానం సాధించిన దళిత మహిళా సర్పంచ్

- పాలనను జీర్ణించుకోలేక కుట్రలు చేస్తున్నారని ఆరోపణ: జడ్పీటీసి ఎర్రజబెత్ రాణి

**గన్నవరం, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**

ఉమ్మడి జిల్లా పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ దళిత మహిళా సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి పై జిల్లాలో మొదట స్థానం అవార్డ్ వచ్చిందని అక్కసు తో అసత్య ఆరోపణలు చేసిన ప్రవీణ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంనీ గన్నవరం మండలం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి డిమాండ్ చేశారు. ఎప్పుడో కట్టిన వాటర్ ట్యాంకు,ఎప్పుడో వేసిన రోడ్డు కు 50 లక్షల బిల్లులు డ్రా చేసినట్లు అసత్య, అబూత కల్పనతో తప్పుడు సమాచారం అధికారులకు,మీడియాకు అగ్రకుల ఆధిపత్యం కలిగిన కూటమి నాయకుడు ప్రవీణ్ అందించాడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసారు. దమ్ముంటే అతను చేసిన ఆరోపణలు రుజువు చేయాలి అని సర్పంచ్ డిమాండ్ స్వీకరించాలి లేదా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను అని అన్నారు.ఒక ట్యాంక్ కు ఒక రోడ్డుకు బిల్లు చేయాలి




అంటే ఏ ఇ, డి ఇ,ఈ ఈ, ఎస్ ఇ,ల సంతకం, ఎం బుక్ చేయాలి. అది తెలిసి కూడా ఆరోపణ చేయటం వెనుక మూడు నెలలో పంచాయితీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం పోటీ చేయటానికి కుట్రలో భాగమే నాని ఆమే అన్నారు.అసలు ఆలా రెండవ సారి బిల్లులు ఎలా చేసుకుంటా రని ఆమె ప్రశ్నించారు. ప్రవీణ్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధం అని ప్రజలందరికీ అర్థం అవుతుందని ఆమె అన్నారు.ఇటీవల పెనుగంచిప్రోలు గ్రామం ఎన్ టీ ఆర్ జిల్లా లో ఉత్తమ గ్రామ స్వచ్ఛ అవార్డు వచ్చింది అని,శానిటేషన్ లో ఐ వి ఆర్ ఎస్ సర్వే లో పెనుగంచిప్రోలు జిల్లా లో మొదటి స్థానం సాధించింది. ఇటీవల యాస్పిరేషన్ బ్లాక్ ప్రగతి పరిశీలన కోసం కేంద్రం నుండి వచ్చిన టీమ్ అధికారి కూడ పెనుగంచిప్రోలు పారిశుధ్య, విధానం,పరిపాలన ను ప్రసంశించారని, ఒక దళిత మహిళ పాలన లో ఇంత మంచి పేరు,అవార్డు రావడం జీర్నించు కోలేక, అసూయ, కులతత్వం తో గ్రామానికి చెడ్డ పేరు తెచ్చేందుకు కూటమి పార్టీలకు చెందిన వారు కలసి కుట్రలు కుతంత్రాలు చేస్తూ ఆమెను మానసికంగా వేధిస్తున్నారని ప్రజలు ఇటువంటి పుకార్లు నమ్మరని పగటి కలలుకన వద్దని కూటమి పార్టీలకు హెచ్చరిక చేస్తున్నాను అని అన్నారు.తప్పుడు ఆరోపణలు చేసిన ప్రవీణ్ అతనికి వెనుక ఉండి నడిపిన వారిపై యస్ సి ఎస్ టి అత్యాచారం కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేదాక సర్పంచ్ కి అండగా ఉంటామని అలాగే ఇటువంటి అభివృద్ధి నిరోధక శక్తులకు అందరం కలిసి గుణపాఠం చెపుదామని తెలిపారు.

## క్వారీ ప్రమాదంలో మరణించిన

# ఉప్పుతల కృష్ణ కుటుంబానికి వైసీపీ నాయకుల పరామర్శ

**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్)**

మాజీ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు కాచవరం పంచాయతీ పరిధిలోని ఆర్ పి ఆర్ క్వారీలో పై నుంచి జారిపడి మరణించిన ఉప్పు తల కృష్ణ కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి, కొండపల్లి మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ లిగుంజా శ్రీనివాసులి మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంద న్నారు. క్వారీల్లో పనిచేసే కార్మికులు ప్రమాదాల బారిన పడి మరణించినప్పుడు క్వారీ యజమా నులు నామమాత్రపు నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం నిత్య కృత్యమైపోయిందని విమర్శిం చారు, దీనిపై ప్రభుత్వం స్పందించి కార్మిక సంక్షేమ బోర్డు నుంచి మృతుడి కుటుం బానికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించా లని డిమాండ్ చేశారు. భద్రత విషయమై యాజమా న్యాలు తగిన సేఫ్టీ పరికరాలను సమకూర్చాలని కార్మిక శాఖ విరివిగా తనిఖీలు చేసి కార్మికుల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మైలవరం వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కుంచం జయరాజు, కాచవరం గ్రామ సర్పంచ్ దండుబోయిన రాజేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు ముద్దంగుల రంగస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజోలు పాపారావు, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు మండే సాగర్, బారామత్తుల రమేష్, బత్తుల రాజేష్, జెటిపిటి లింగయ్య, జెటిపిటి ఏడుకొండలు, నాయకులు వేముల వెంకటేశ్వర్లు, వేముల రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# అబద్ధాలు, అభివృద్ధి మధ్య జూబ్లీహిల్స్‌లో పోరు

## ప్రయాణించే బండి కావాలా? మూలనపడ్డ కారుకావాలా?: మంత్రి పొన్నం ప్రభాకర్



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార కాంగ్రెస్‌తోనే సాధ్యమనీ, త్వరలో జరగబోయే ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య కాదనీ కాంగ్రెస్ అభివృద్ధికి,బిఆర్ఎస్ అబద్దాలకు మధ్య జరుగుతుందని మీకు అభివృద్ధి కావాలా? అబద్ధాలు కావాలా ?తేల్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతలు చరణ్ కౌశిక్ యాదవ్ ,బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, భాస్కర్‌లతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ప్రజా పాలన ప్రభుత్వం లో సంక్షేమం అభివృద్ధికి ప్రజలు పట్టం కడుతున్నారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉందనీ బిఆర్ఎస్ కేంద్రంలో కానీ, రాష్ట్రంలోగానీ అధికారంలేని ఆ పార్టీకి ఓటేస్తే ఉపయోగం లేదని హితవు పలికారు. ప్రయాణించే బండి ఎక్కాలి,కానీ మూలనపడ్డ కారు ఎక్కితే మీరు ముందుకు పోలేరని సలహా ఇచ్చారు. జూబ్లీహిల్స్ లో బండలను కరిగించి పేదలకి ఇండ్ల పట్టాలు, ఇండ్లు కట్టించి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని ఆయన గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2.40లక్షల మందికి సన్న బియ్యం వంపిణీ జరుగుతోందని 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 500 కి గ్యాస్ అందిస్తున్నామనీ చెప్పారు. యువతకు 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు.బిఆర్ఎస్ 10 సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి చెప్పకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.

ఓటు చోరీ అంశాన్ని లేవనెత్తింది రాహుల్ గాంధీ ఇక్కడ బిఆర్ఎస్ బిజెపి కలిసి డైవర్షన్ పాలిటిక్స్ ఓటు చోరీ పై మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా అభ్యర్థి బిసి బిడ్డ విద్యావంతుడు నిత్యం ప్రజల్లో ఉండే నవీన్ యాదవ్ ను రౌడీ అంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బిఆర్ఎస్‌వాళ్ళుఆటోలో ప్రయాణం చేస్తూ రాజకీయ డ్రామాలు చేస్తున్నాని ఆగ్రహం వ్యక్తంచేశారు.

2012 తరువాత నగరంలో ఒక్క ఆటోకి పర్మిట్ ఇవ్వలేదని అప్పుడు బొత్స సత్యనారాయణ ఇచ్చినవి తప్ప మళ్ళీ ఇవ్వలేదని ఆయన వివరించారు. మేము 20 వేల ఎలక్ట్రిక్ ఆటో లకు అనుమతి ఇచ్చామని10 వేల సిఎన్‌జి 10 వేలు ఎల్‌పిజి ఆటో లకు అనుమతి ఇచ్చామని ఆయన వివరించారు. బిఆర్ఎస్ పార్టీ బహిష్కృత నేత కవిత అడుగుతున్న ప్రశ్నలకు జవాబులు చెప్పి ఓట్లు అడగండని మంత్రి సూచించారు.10 సంవత్సరాల్లో మీ పార్టీ,2 సంవత్సరాల్లో మేము ఏం చేశామో చర్చిద్దామని సవాల్ విసిరారు. బలహీన వర్గాల అభ్యర్థి నవీన్ యాదవ్ కు భవిషత్ లో కూడా మద్దతుగా ఉంటామని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న కేంద్ర మంత్రి 10 ఏళ్లలో ఈ నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు.

రామచంద్రరావు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడా? యూసుఫ్ గూడా డివిజన్ అధ్యక్షుడా? అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లు బిఆర్ఎస్ బిజెపీ కలిసి పని చేస్తున్నాయనీ విమర్శించారు.

## లో కాజ్‌వేలు, కల్వర్టులు వద్ద వాహనదారులను అప్రమత్తం చేయండి

### ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్, అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలకు అనేక చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని లోకాజ్‌వే, కల్వర్టులపై వెళ్ళే వాహనదారులను అప్రమత్తంగా ఉండేలా రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు పూను కోవాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి వెంకట్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆర్ అండ్ బి ఇఎన్‌సి లు,సి.ఇలు,ఎస్ఇ లతో మంత్రి ఫోన్లో సమీక్ష నిర్వహించారు. ఆర్ అండ్ బి అధికారులు ప్రతి ఒక్కరు ఫీల్డ్ లెవెల్‌లో హై అలెర్ట్‌గా ఉండాలనీ ఆదేశించారు. అత్యవసరం అయితే తప్పా ఎవరూ సెలవుపై వెళ్లొద్దనీ మంత్రి స్పష్టం చేశారు. లో కాజ్ వేలు,కల్వర్టులు వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలనీ కోరారు.ప్రజలను అప్రమత్తం చేయడానికి పోలీసు,రెవెన్యూ, విద్యుత్, ఇరిగే షన్, పిఆర్ శాఖ లతో సమన్వయం చేసుకోవాల న్నారు.ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్ అన్ని జిల్లాలతో అనుసంధానం చేయాలనీ సూచించారు. ఎమర్జెన్సీ ప్రజా రవాణాకు ఇబ్బం దులు లేకుండా ప్రత్యామ్నాయమార్గాలు చూపాలనీ,అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసరమైతేనే ప్రజలు రోడ్లపైకి రావాలనీ, అధికారులు సూచించే జాగ్రత్తలు పాటించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి అజెండాతోనే ప్రచారం

### అక్కడ లక్ష మందిని మించిన లబ్ధిదారులు

### ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయ ప్రకటన

**జర్నలిస్ట్ ఫైల్ ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు 30 :** డెవెలప్‌మెంట్ నినాదంతో ప్రజా ప్రభుత్వం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ముందంజలో ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం తెలిపింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 3.98 లక్షల మంది ఓటర్లున్నారు.నియోజకవర్గంలోని దాదాపు లక్ష కుటుంబాలు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్నారు.ఆరు గ్యారంటీలతో పాటు సన్న బియ్యం పథకాలు, ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ ఇక్కడ అధికార పార్టీకి నమ్మకమైన ఓటు బ్యాంకుగా మారాయి. నియోజకవర్గంలో 200 యూనిట్లలోపు ఉచిత గృహ విద్యుత్తు లబ్ధిదారులు 25,925 కుటుం బాలు.రూ.500 లకు గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులు 19,658 కుటుంబాలు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణంతో 2023 డిసెంబర్ 9 నుంచి ఇప్పటివరకు హైదరాబాద్‌లో కోటి మందికిపైగా జీరో టికెట్‌పై ప్రయాణించారు. దాదాపు రూ.2410 కోట్లు ఆదా చేసుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధి లోని మహిళలు దాదాపు రూ.120 కోట్లు ఆదా చేసుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 14,197 కొత్తరేషన్ కార్డులు జారీ చేసింది. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో అదనంగా 8,123 మంది పేర్లను నమోదు చేసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం స్పెషల్ డెవెలప్ మెంట్ ఫండ్ (ఎస్‌డిఎఫ్) కింద రూ. 5.51 కోట్లతో చేపట్టిన రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి పనులు నిర్మాణంలో ఉన్నాయి. కొత్తగా పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, 11 కేవీ ఫీడర్లు, దాదాపు 13 కిలోమీటర్ల మేరకు ఎల్ టీ లైన్ అధునీకరణ పనులను రూ.11 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ నియోజకవర్గంలో రూ.162 కోట్లతో అండర్ గ్రౌండ్ విద్యుత్తు లైన్ వేయాలని జీహెచ్ఎంసీ ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

## విలువలతో కూడిన విద్యను అందించాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ


బుధవారం హబ్సిగూడలో జరిగిన కౌన్సిల్ ఆఫ్ బోర్డ్స్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ 54వ వార్షిక సమావేశాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ బిష్టదేవ్ వర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా తదితరులు

**హైదరాబాద్ (ఉప్పల్), అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్) :** సాంకేతికతను, కాలానుగుణ మానవ సూత్రాలతో సమన్వయం చేసే విలువలతో కూడిన విద్యా వ్యవస్థను రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కోరారు. భారతదేశంలో సాంస్కృతిక సుసంపన్నమైన విలువతో కూడిన విద్యను అందిం చాలని ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం కౌన్సిల్ ఆఫ్ బోర్డ్స్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ 54వ వార్షిక సమావేశాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సులో కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ బాకలారియేట్ ప్రతినిధులు సహా దేశ, విదేశాలకు చెందిన పాఠశాల బోర్డుల నుంచి వంద మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ, భౌగోళిక రాజకీయాలలో మాత్రమే కాకుండా, నాగరికతలో కూడా ప్రపంచాన్ని నడిపిస్తుందని అన్నారు. భారతదేశ సాంస్కృతిక పునాదుల చుట్టూ విద్యను వలస రాజ్యం నుండి తొలగించి తిరిగి దిశానిర్దేశం చేయవలసిన అవసరాన్ని గవర్నర్ నొక్కి చెప్పారు. విద్య భవిష్యత్తును రూపొందిస్తుందని, పిల్లలపై ప్రభావం ఉంటుందన్నారు. పాఠశాల కేవలం నేర్చుకునే ప్రదేశం కాదని, మన దేశం యొక్క రేపటికి పుట్టినిల్లు అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ మార్పుకు విద్య ఎంతో అవసరం అన్నారు.

తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి డా. యోగితా రాణా మాట్లాడుతూ సహకారం, ధైర్యం వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు నాయకత్వ లక్షణాలు పెంచు కోవాలని, మంచి విద్య విధానం ద్వారానే వారి భవిష్యత్ రూపొందుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో సిఐఎస్‌సిఇ చైర్మన్ డా.జోసెఫ్ ఇమ్మా న్యుయేల్, ప్రధాన కార్యదర్శి ఎంసి శర్మ, ఐఎఎస్ అధికారి కృష్ణ అదిత్య, డా.షమీమ్ చౌదరి, మహేష్ బాలకృష్ణన్, డాక్టర్ సోనా అహుజా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్‌నెస్ వ్యవస్థాప కుడు, డైరెక్టర్ రవిశర్మ, స్కంద్ శుక్లా, దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెరకు రైతుల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వాలు

### సంఘం అఖిలభారత అధ్యక్షుడు డి.రవీంద్రన్

**హైదరాబాద్,అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్) :** చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెరుకు రైతుల సంఘం అఖిలభారత అధ్యక్షులు డి రవీంద్రన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ లు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో వ్యవసాయ సీజన్, సీజన్‌కు చెరుకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. 2014-15 ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణలో 1,25,000ఎకరాల విస్తీర్ణంలో సాగు కాగా, 2025-26 వ సీజన్లో కేవలం 50 వేల ఎకరాల లోపు మాత్రమే సాగు అవుతుంది. తెలంగాణ రాష్ట్రం లో మొత్తం సాగు విస్తీర్ణం 1కోటి 32 లక్షల ఎకరాల్లో చెరుకు 0.5 శాతం కూడా లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రతి చెరుకు క్రషింగ్ సీజన్ కంటే ముందు ప్రకటించే ఎఫ్ఆర్పి లో మార్పులు చేసిన ఫలితం చెరకు సాగు నుంచి రైతులు


ప్రసంగిస్తున్న చెరుకు రైతుల సంఘం అఖిలభారత అధ్యక్షులు డి రవీంద్రన్

దూరమయ్యారు. గతంలో చెరుకు టన్నుకి 8.5 పంచదార రికవరీ పై ధర నిర్ణయించగా మొదట 9.5 కు నేడు 10.5 రికవరీ బేస్ పై ధర నిర్ణయం మూలంగా రైతులకు 8.5 పైన ఉన్న రికవరీ కి అదనంగా డబ్బులు చక్కర పరిశ్రమ చెల్లించాల్సి ఉండగా 10.5 కు పెంచడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిజాం షుగర్ పరిశ్రమలు పునరుద్ధరణ ప్రయత్నాలు జరిగినా ఆశించిన స్థాయిలో సాగు లేదన్నారు. చెరుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ...రాష్ట్ర, దేశ అవసరాలకు అనుగుణంగా చెరుకు సాగు ఆశించిన స్థాయిలో ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనుకూలమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, చెరుకు రైతు సంఘం రాష్ట్ర నాయకులు రచ్చ నర్సింహ్మా రావు, తోటకూర రాజు, ఎనమద్ది రామకృష్ణ నెల్లూరు నాగేశ్వరరావు, లక్ష్మీనారా యణ, ఎనమద్ది లెనిన్ సంగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న


అదితా స్వప్నకు నియామక పత్రం అందిస్తున్న అల్కా లాంబా

**హైదరాబాద్, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న నియమితుల య్యారు. ఈమేరకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీ లకురాలిగా బి.అదితా స్వప్నను నియమిస్తూ బుధవారం ఉత్త ర్వులు అందించారు.గతంలో అదితా స్వప్న బీహార్, పుదుచ్చేరి ,అండమాన్,నికోబార్ దీవులకు జాతీయ పరిశీలకురాలిగా విజయవంతంగా పని చేశారు. ఆమె అంకిత భావం, సామర్థ్యంను కాంగ్రెస్ అగ్రనేతల రాహుల్ గాంధీ గుర్తించి, ఆంధ్రప్రదేశ్ బాధ్యతను ఇప్పుడు ఆమెకు అదనంగా అప్పగిం చాలని సూచించడంతో ఈ నియామకం జరిగింది. అదితా స్వప్న మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి నూతన బాధ్యతను అప్పగిం చినందుకు రాహుల్ గాంధీకి, అల్కా లాంబాకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్‌లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి, రాహుల్ గాంధీ దార్శనికత, నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

## తెలుగు వర్సిటీ విస్తృతదిశగా ముందడుగు

### పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎపి ఉపాధ్యక్షుడు ఆచార్య డా. మునిరత్నంనాయుడు


పురస్కారగ్రహీతలతో మునిరత్నంనాయుడు, నిత్యానందరావు, హనుమంతరావు, రమేష్, రామమూర్తి తదితర అతిథులు

**ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానం**

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 30(జర్నలిస్ట్‌ఫైల్) :** తెలుగు విశ్వవిద్యాలయం కేవలం ఇరు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా విశ్వవ్యాప్త విస్తృతదిశగా అడుగులు వేసేందుకు కృషిచేస్తున్నట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం,ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.మునిరత్నం నాయుడు అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం ఉభయ తెలుగురాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో ఏర్పడడం శుభసూచకమన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం సాయంత్రం 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య డి.మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి విశిష్ట అతిథులు ఎస్. రమేష్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవావిభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి తదితరులతో కలిసి 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఎంపికైన ఉత్తమ గ్రంథ రచయితలను ఘనంగా సత్కరించి సాహితీ పురస్కారాలు, ఒక్కొక్కరికి రూ.20,116 నగదు పారితోషికం ప్రదానంచేసి అభినందించి ప్రసంగించారు. ముందుగా హనుమంతరావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేయగా రామమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు. చివరిగా ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న రింగు రామమూర్తిని ఉపాధ్యక్షుడు ఘనంగా సత్క రించారు.సాహితీ పురస్కార గ్రహీతలలో పద్యకవిత ప్రక్రియలోని ఉత్తమ గ్రంథం ధర్మపురీ వైభవం రచయిత ఒజ్జల నరహరిశర్మ; వచన కవిత నేను యౌగిక కావ్యం విశ్వర్షి వాసిలి; గేయకవిత తెలంగాణ రుబాయిలు డా. ఏనుగు నరసింహారెడ్డి; బాలసాహిత్యం చందమామ చెప్పిన కథలు డా. ఎం.హరికిషన్; కథ నా నుండి మన వరకు డా. టి.సం పత్‌కుమార్; నవల మాదిగ కొలుపు ఆచార్య పులికొండ సుబ్బాంచారి; సాహిత్య విమర్శ ద్విక్చక్రం ఆదెపు లక్ష్మీపతి; నాటకం రచ్చబండ రావుల పుల్లాచారి; అనువాదం మృత్యుంజయుడు డా. టి.సి.వసంత; వచన రచన తిరుపతి కథలు ఆచార్య వేట శ్రీనివాసులురెడ్డి; రచయిత్ర ఉత్తమ గ్రంథం స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి డా. జంధ్యాల కనకదుర్గలు ఉన్నారు.

## డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం

### దానం చేసిన డిజిపి శివధర్ రెడ్డి సహా సీనియర్ ఐపిఎస్‌లు

**హైదరాబాద్, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం నాడు డిజిపి కార్యాలయంలో రక్త దాన



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా డిజిపి కార్యాలయంలో జరిగిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న డిజిపి శివధర్ రెడ్డి, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులు

శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో డిజిపి శివధర్ రెడ్డి, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, రమేష్ సహా డిజిపి కార్యాలయ అధికారులు, సిబ్బంది మొత్తం 164 మంది పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారవుతామని తెలిపారు. రక్తదానం చేసేందు కు అందరు ముందుకు రావాలని ఆయన కోరారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 450 0 యూనిట్ల రక్తాన్ని దానం చేశామని ఆయన తెలిపారు. ఏడాదిలో ప్రతీ ఒక్కరు నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చని ఆయన వెల్లడించారు. దీనివ ల్ల రక్తదానం చేసిన వారు మరింత చురుకుగా వుంటారని ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడుతున్న వారిలో అనేక మంది సరైన సమ యంలో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల మరణిస్తున్నారని డిజిపి తెలిపారు. డిజిపి కార్యాలయంలో తొలిసారిగా జరిగిన రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున అధికారులు, సిబ్బంది పాల్గొనడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐజి రమణకుమార్, నాగరాజుతో పాటు రెడ్ క్రాస్ తరపున డాక్టర్ పిచ్చిరెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహనకు జనగామలో హాల్టింగ్

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** జనగామాలో గురువారం నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్ ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగు పరచడానికి రెండు నిమిషాలు నిలుపుటకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్‌శ్రీవాత్సవ ఉత్తర్వులు జారీచేశారు. భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ప్రయోగాత్మకంగా విజయవాడ - సికింద్రాబాద్ 12713ఎగువ, సికింద్రాబాద్ -విజయవాడ12714 దిగువ శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు జనగాం రైల్వే స్టేషన్‌లో అదనపు స్టాపేజ్ మంజూరు చేసినట్లు ప్రకటించారు. శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు జనగాం స్టేషన్‌లో స్టాపేజ్ కల్పించడం వలన ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది. ఈ ప్రజా విజ్ఞప్తిని గౌరవించి తక్షణం స్పందించిన దక్షిణ మధ్య రైల్వే యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.అలాగే, ఆయన ఈ నిర్ణయం జనగాం మరియు పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉం టుందని ఎంపి చామల పేర్కొన్నారు.


సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మహేకుమార్

## హారీష్ రావును పరామర్శించిన టిపిసిసి చీఫ్

**హైదరాబాద్,అక్టోబరు 30(జర్నలిస్ట్ ఫైల్):** మాజీ మంత్రి హారీష్ రావును బుధవారం టిపిసిసి ప్రసిడెంట్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ కలిసి పరామర్శించారు. మాజీమంత్రి హారీష్ నాన్న సత్యనారాయణ రావు మం గళవారం అనారోగ్యంతో మృతి చెందారు. హారీష్ రావు తండ్రి సత్యనా రాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సం దర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎంపి మధు యాష్కీ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. హారీష్‌రావు తండ్రి చనిపోకముందు ఉన్న ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

## బిఆర్ఎస్‌తో నాకు సంబంధం లేదు

### నేను ఎవరికీ ఎ,బి టీం కాదు

### సామాజిక తెలంగాణే లక్ష్యం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

**మహబూబ్‌నగర్‌బ్యూరో, అక్టోబరు30(జర్నలిస్ట్ ఫైల్):** 'నాకు బిఆర్ఎస్‌తో సంబంధం లేదు. బీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవీ నాకొద్దు.. నా రాజీనామా ఆమోదించమని కోరుతున్నా' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థ అని, గతంలో అనేక ఉద్యమాలు చేశామని, తెలంగాణ ఉద్యమంలో తమకంటూ ఓ పేజీనే క్రియేట్ చేసుకున్నామని గర్వంగా చెప్పగలనని తెలిపారు. సాధించుకున్న తెలంగాణలోను తమ వంతు పాత్ర పోషించామని, తెలంగాణ వచ్చిన తర్వాత స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు పెట్టి ఎంతో మంది యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేశామన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీ గాను తన దృష్టికి వచ్చిన ఎన్నో సమస్యలను పరిష్కరించానని తెలిపారు.

**నా వెనక ఎవరూ లేరు:** తాను ఇండిపెండెంట్ అని, తన వెనుక ఎవరు లేరని, ముందు మాత్రం ప్రజలు ఉన్నారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. దగాపడ్డ ఉద్యకారుల్లో తానూ బాధితురాలినే అన్నారు. కాంగ్రెస్ వాళ్లు నేను బీజేపీ బీ టీమ్ అని, బీజేపీ వాళ్లు కాంగ్రెస్ బీ టీమ్ అని అంటారని, బీఆర్ఎస్ వాళ్లు ఏదేదో ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయితే తన నడక ద్వారా నా స్టాండ్ ఏంటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. నీళ్లు,నిధులు, నియామకాలు విషయంలో రేవంత్ రెడ్డినిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

**సామాజిక తెలంగాణ లక్ష్యం:** మనం భౌగోళిక తెలంగాణ మాత్రమే సాధించామని, సామాజిక తెలంగాణ విషయంలో ఇంకా ఒక్క అడుగు వెనుకే ఉన్నామని కవిత అన్నారు. మొన్న జడ్చర్లలోని ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం అందక ఒక యువ రైతు చనిపో యాడని, ఎంతో ఆశతో, ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణలో వైద్యం అందిం చలేని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య విషయంలో అదే పరిస్థితి ఉందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవటంతో పేద విద్యార్థులు ఇంటి దగ్గరే ఉంటున్నారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మీద ఆధారపడి చదవుకునే వారికి విద్య దొరకకుండా చేస్తున్నారని పేర్కొన్నారు.

## తుఫాను ప్రభావంపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్

**జర్నలిస్ట్ ఫైల్ ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు30:** మొంథా తుఫాను నేపథ్యంలో తలెత్తే పరిణామాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో ఆమెమాట్లాడారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అత్యవసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు, పశువుల కాపరులు తమపశువులు, పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయరాదని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకుదూరంగా ఉండాలని కోరారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారంఅందుతున్న నేపథ్యంలో, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమేసహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావంతగ్గేవరకు ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతేతప్ప ఇళ్లనుంచి బయటకురాకూడదని మంత్రి కోరారు.

## వర్షాల నుండి పంటలను కాపాడు కోవాలి: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాను తీరం దాటి దిశ మార్చుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రైతులు తమ పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ మంత్రి తమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుండి బుధవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి పలు సూచనలు చేశారు. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు తమ పంటలను భారీ వర్షాల నుండి కాపాడుకోవాలని ముఖ్యంగా వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. తొందరపడి పంటలను అమ్ముకోవొద్దన్నారు. ఇదే సమయంలో లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలను వాగులు వంకలు దాటకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అందుకోసం పోలీసు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే ఈ వర్ష ప్రభావంతో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా చెరువుల వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

# ఓట్ల కోసం డాన్స్‌కైనా మోడీ రెడీ!

- ట్రంప్ బెదరింపులవల్లే నోరుమెదపడంలేదు
- బిజెపి రిమోట్ కంట్రోల్‌లో నితీశ్ సర్కార్
- బీహార్ ఎన్నికల సభలో రాహుల్



**ముజఫర్‌పూర్, అక్టోబరు 30 :** ఓట్ల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏదైనా చేస్తారు, బీహార్‌లోని ప్రజలు అతడిని డ్యాన్స్ చేయమని అడిగితే, ఖచ్చితంగా డ్యాన్స్ చేస్తారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని బిజెపి రిమోట్ కంట్రోల్ ద్వారా నడుపుతోందని ఆరోపణలు గుప్పించారు. బుధవారం ముజఫర్‌పూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో కూటమి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్‌తో కలిసి రాహుల్‌గాంధీ పాల్గొని ప్రసంగించారు. "నరేంద్రమోడీ అన్ని రకాల డ్రామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ మీరు డ్యాన్స్ చేస్తే తాము మీకు ఓటేస్తామనండి. ఆ మరుక్షణమే భరత నాట్యం ప్రదర్శిస్తారు" అని ప్రధానిపై రాహుల్ విమర్శలు గుప్పించారు. బీహార్ ప్రజలు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారనే భ్రమలో ఉన్నారు, అదంతా తప్పు బిజెపి రిమోట్ కంట్రోల్‌లో నితీశ్ ఉన్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. నితీశ్ నాయకత్వం కేవలం ఒక ముసుగు మాత్రమే, నిజమైన అధికారం బిజెపి వద్ద ఉందని, అది కూడా ముగ్గురు నలుగురు వ్యక్తుల వద్దే ఉందన్నారు. పాలక ఎన్‌డిఏకు సామాజిక సమానత్వం పట్ల నిబద్ధత లేదని ఆరోపణలను పునరుద్ఘాటించారు. "ట్రంప్‌ను చూసి ప్రధాని మోడీ భయపడుతున్నారు. అమెరికా ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందన్న ట్రంప్ వాదనపై మోడీ ఇంత వరకు నోరు మెదపలేదు. ఈసారి ఆయన బీహార్ వచ్చినప్పుడు అమెరికా అధ్యక్షుడు భారత్ – పాక్ వివాదాన్ని ఆపడం గురించి ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోడీ చెప్పాలి" అని రాహుల్ గాంధీ ప్రధానికి సవాల్ విసిరారు. 11ఏళ్లలో మోడీ సర్కార్ నోట్ల రద్దు, లోపభూయిష్ట జిఎస్‌టి వంటి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని రాహుల్ దుయ్యబట్టారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పట్టుబట్టడంతోనే మోడీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. మోడీ- నితీశ్ ప్రభుత్వాల దమననీతిని గుర్తెరిగి బీహార్ ప్రజలు ఈసారి స్పష్టమైన తీర్పు ఇవ్వాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు.

# కచ్చాతీవును రాజకీయం చేయొద్దు!

## శ్రీలంక మంత్రి సుందరలింగం ప్రదీప్



**న్యూఢిల్లీ, అక్టోబరు 30 :** కచ్చతీవు సమస్యను రాజకీయాలకు అతీతంగా చూడాలని శ్రీలంక మంత్రి సుందరలింగం ప్రదీప్ కోరారు. 1974లో భారత్, శ్రీలంక మధ్య జరిగిన ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం కచ్చతీవును తమ దేశానికి అప్పగించారని గుర్తు చేసుకున్నారు. అంతర్జాతీయ ఒప్పందం ద్వారా చట్టపరంగానే భారత్ తమ దేశానికి కచ్చతీవును అప్పగించిందని పేర్కొన్నారు. భారత్ నుంచి శ్రీలంక కచ్చతీవును బలవంతంగా లాక్కోలేదని వెల్లడించారు. ఎన్నికల సమయంలో కచ్చతీవు సమస్య గురించి మాట్లాడే రాజకీయ నాయకుల ప్రకటనలను ప్రజలు గ్రహించాలని కోరారు. భారత్, శ్రీలంక మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కచ్చతీవు వంటి సమస్యలు ఇరుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీయకూడదని రెండు దేశాల మత్స్యకారులపై సముద్ర వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మత్స్యకారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి భారత్, శ్రీలంక ప్రభుత్వాలు కూర్చొని మాట్లాడుకోవడం ఉత్తమం. మత్స్యకారుల సమస్యను సోదర సమస్యలా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. శ్రీలంక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమకు సహాయం చేసిన తొలి దేశం భారత్. తమ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు కూడా భారత్ అండగా నిలిచింది. అందుకు భారత్‌కు మేం ఇప్పటికీ కృతజ్ఞులం. చర్చల ద్వారా మనం ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ప్రదీప్ అన్నారు. తమిళనాడు మత్స్యకారులపై దాడులు, వారి అరెస్టుల గురించి అడిగిన ప్రశ్నకు ప్రదీప్ సమాధానం ఇచ్చారు. రెండు దేశాలు చర్చలు జరిపితేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. భారత్, శ్రీలంక ప్రభుత్వాలు చాలా కాలంగా సరిహద్దు దాటి చేపలు పడుతున్న మత్స్యకారులను అరెస్టు చేస్తున్నాయని గుర్తు చేసుకున్నారు. భారత్, శ్రీలంక మత్స్యకారులు తమ మధ్య అవగాహన కుర్చుకోవాలని వెల్లడించారు.

'రాజకీయ లబ్ది, ఎన్నికల కోసం మాట్లాడకుండా మత్స్యకారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఏకైక మార్గం రెండు దేశాల ప్రభుత్వాలు చర్చలు జరపడమే. భారత్, శ్రీలంక మధ్య ప్రస్తుతం సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. చర్చల ద్వారా మాత్రమే మత్స్యకారుల సమస్యను పరిష్కరించవచ్చు. సోదరసోదరి సమస్యలానే మత్స్యకారుల సమస్యను కూడా కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించాలి. బదులుగా, మనం రాజకీయాల కోసం ఏదైనా మాట్లాడితే, అది సమస్యను మరింత జఠిలం చేస్తుంది. "అని ప్రదీప్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోపే శబరిమల యాత్రను పవిత్ర యాత్రగా ప్రకటించాం. శబరిమల యాత్రను పవిత్ర యాత్రగా ప్రకటించిన ప్రపంచంలోని ఏకైక దేశం శ్రీలంక. అంతే కాదు, తమిళ ముస్లింల సంస్కృతి, మత స్వేచ్ఛకు ప్రాముఖ్యత ఇస్తున్నామని శ్రీలంక మంత్రి పదీప్ అన్నారు.

# ట్రంప్‌కు దక్షిణకొరియా అత్యున్నత పురస్కారం

## సిల్లా చరిత్రకు ప్రతీకగా నిలిచిన బంగారు కిరీటం బహూకరణ



**సియోల్, అక్టోబరు 30 :** స్వదేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వ్యతిరేక పవనాలు ఎదుర్కొంటుంటే విదేశాల్లో మాత్రం ఆయనకు పట్టం కడుతున్నారు. నోకింగ్స్ ఏరిట అమెరికాలో ట్రంప్ నిరసనలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. అయితే ఆసియా పసిఫిక్ ఆర్థికసహకార సంఘ సమావేశాల్లో పాల్గొనేందుకు దక్షిణకొరియాకు వచ్చిన అమెరికా అధ్యక్షుడికి ఆదేశ అత్యున్నత పురస్కారం అందించింది. దేశ అధ్యక్షుడు లీజాయ్ మ్యూంగ్ అమెరికాతో 350 బిలియన్ డాలర్ల వాణిజ్య డీల్ సక్సెస్ అయిన సందర్భంగా దక్షిణకొరియానేత ఈ అత్యున్నత పురస్కారం అందించారు. అమెరికా, దక్షిణకొరియాలమధ్య సుదీర్ఘ పెట్టుబడులతోకూడిన వాణిజ్య ఒప్పందం కుదిరిందని, పెట్టుబడులు, నౌకా నిర్మాణాలకు డీల్ కుదిరినట్లు దక్షిణకొరియా ప్రకటించింది. అలాగే అమెరికాకు దక్షిణకొరియా ఆర్థికపరంగా 350 బిలియన్ డాలర్లమేర పెట్టాలని నిర్ణయించింది. 200 బిలియన్ డాలర్లునగదు పెట్టుబడులు, 150 బిలియన్ డాలర్లు నౌకా నిర్మాణంలో సహకారం అందిస్తుందని కిమ్‌జాయే మ్యూన్ తెలిపారు. ప్రస్తుతంఅమెరికా అధ్యక్షుడికి బహూకరించిన కిరీటం గతంలో ప్రాచీన సిల్లా సామ్రాజ్యంలో శాంతిస్థాపనకు బహూకరించిన కిరీటానికి ప్రతిరూపంగా ఉంటుంది. ప్రాచీనకాలంలో గ్యాయంగ్‌ఝు రాజధానిగా సిల్లా సామ్రాజ్యం నడిచింది. ఈ కిరీటాన్ని 'గ్రాండ్ ఆర్డర్ ఆఫ్ ముగుంగ్వా'గా అందిస్తారు. కొరియాకు సంబంధించి అత్యున్నత పురస్కారంగా భావిస్తారు. కొరియా అధికారిక పుష్పం ఎర్ర మందారంకూడా ఈ పురస్కారంపై చెక్కుతారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పి నందుకుగాను సిల్లా సామ్రాజ్య చరిత్రకాలంలో ఈ పురస్కారం ప్రధానంచేసేవారు. ఎనిమిదియ యుద్ధాలు నివారించానని చెపుతున్న ట్రంప్ శాంతిస్థాపనకు విశేష కృషిచేసారని గుర్తింపుగా ఈ అత్యున్నత కిరీట పురస్కారం ప్రధానంచేస్తున్నట్లు దక్షిణకొరియా ప్రకటించింది. అలాగే అమెరికా అధ్యక్షుడి పర్యటన సందర్భంగా భారీ ఎత్తున విందును కూడా ఏర్పాటుచేసింది.

ఈ విందుకు వియత్నాం, ఆస్ట్రే లియా, న్యూజిలాండ్, కెనడా, థాయిలాండ్, సింగపూర్‌నేతలు కూడా హాజరవుతున్నారు.



# సిఎం, పిఎం పోస్టులు ఖాళీ లేవు

## - సోనియా, లాలూపై అమిత్ షా సెటైర్లు

**దర్భంగా, అక్టోబరు30:** ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తమ కుమారులను బీహార్ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిని చేయాలని కలలు కంటున్నారని, కానీ ఆ పదవులు ఖాళీగా లేవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో ప్రస్తుతం ఏ సీటు ఖాళీగా లేదని ఆయన స్పష్టం చేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఉంటారని తేల్చి చెప్పారు. బీహార్‌లోని దర్భంగాలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సభలో అమిత్ షా మాట్లాడుతూ, ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. లాలూ ప్రసాద్ యాదవ్ తన తనయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని చూస్తే, సోనియా గాంధీ తన కొడుకును ప్రధాన మంత్రిని చేయాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చాలా మంది యువకులకు టిక్కెట్లు ఇచ్చింది, కానీ ఆర్‌జెడి, కాంగ్రెస్ ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు. అది మహాఘట్ బంధన్ కాదు దొంగ బంధన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేసిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్‌ఐ) సంస్థకు చెందిన కార్యకర్తలను మహాగర్ బంధన్ బీహార్‌లో అధికారంలోకి వస్తే జైలులోనే ఉంటారా? అని ప్రశ్నించారు. పట్నాలోని ఫుల్వారీ షరీఫ్‌లో పిఎఫ్‌ఐ కార్యకర్తలు చురుకుగా ఉన్నారని ఆరోపించారు. తేజస్వి, రాహుల్ బీహార్‌లో జంగిల్ రాజ్ తిరిగి తీసుకురావడానికి యత్నిస్తున్నారని, ఆ అవకాశం ఇవ్వొద్దని అమిత్ షా పిలుపునిచ్చారు. ఎన్‌డిఏ ప్రభుత్వం బీహార్‌లోని 8.52 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నదని, మఖానా బోర్డును ఏర్పాటు చేసిందని అమిత్ షా తెలిపారు. గృహ వినియోగదారులకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని గుర్తు చేశారు. దర్భాంగాకు త్వరలో మెట్రో రైలు వస్తుందని, ఇప్పటికే విమానాశ్రయం నిర్మితమైందని పేర్కొన్నారు. ఎయిమ్స్ నిర్మాణ దశలో ఉందని వెల్లడించారు. మిథిలాలో సీతాదేవి ఆలయం నిర్మిస్తున్నామని, ఆమె సందర్శించిన అన్ని ప్రదేశాలు రామ్ సర్క్యూట్‌కు అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు.

# మాకు డబ్బు ముఖ్యం కాదు

## విజయ్‌కు సొమ్ము తిప్పిపంపిన మృతుని భార్య



**కరూర్, అక్టోబరు 30 :** కరూర్ తొక్కిసలాటలో భర్తను కోల్పోయిన ఓ మహిళ టీవీకే అధినేత, నటుడు విజయ్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. తమకు డబ్బు ముఖ్యం కాదని చెబుతూ విజయ్ తమ ఖాతాలో జమ చేసిన రూ.20 లక్షలను తిప్పి పంపించింది. విజయ్ నుంచి తాము ఓదార్పు కోరుకున్నాం తప్ప డబ్బు కాదని చెప్పారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 27న కరూర్ లో నిర్వహించిన విజయ్ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది చనిపోయిన విషయం తెలిసిందే. మరణించిన వారిలో రమేశ్ కూడా ఒకరు. తొక్కిసలాట జరిగిన కొద్ది రోజులకు విజయ్ తమతో వీడియో కాల్ లో మాట్లాడారని రమేశ్ భార్య సంఘవి తెలిపారు. నేరుగా వచ్చి పరామర్శిస్తానని, ముందుగా పరిహారం తీసుకోవాలని విజయ్ కోరారన్నారు. ఈ నెల 18న తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తరఫున తమ బ్యాంకు ఖాతాలో రూ.20 లక్షలు జమ అయిందని వివరించారు. అయితే, తమకు డబ్బు ముఖ్యం కాదని, విజయ్ పరామర్శ కోసం ఎదురుచూశామని సంఘవి చెప్పారు. తాజాగా కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలను విజయ్ చెన్నైకి పిలిపించుకుని ఓ రిసార్ట్ లో సమావేశమయ్యారని సంఘవి గుర్తుచేశారు. ఆ సమావేశానికి తాము వెళ్లలేదని, తమ పేరు చెప్పుకుని తమ బంధువులు వెళ్లారని సంఘవి ఆరోపించారు. విజయ్ పరామర్శిస్తారని భావిస్తే డబ్బు పంపారని, ఆ డబ్బు తమకు అక్కర్లేదని తిప్పి పంపామని సంఘవి వివరించారు. డబ్బు తిప్పి పంపిన రశీదును ఆమె మీడియాకు చూపించారు.

# అబూదాబి లాటరీలో భారతీయుడికి రూ.240 కోట్లు




**అబూదాబి, అక్టోబరు 30 :** అబుదాబిలో నివసిస్తున్న ఏపీకి చెందిన ఓ తెలుగు యువకుడిని అదృష్టం వరించింది. అమ్మపై ఉన్న ప్రేమ అతడిని రాత్రికి రాత్రే కోటీశ్వరుణ్ని చేసింది. యూఏఈ లాటరీ చరిత్రలోనే అతిపెద్ద జాక్‌పాట్‌గా నిలిచిన 100 మిలియన్ దిర్హామ్‌లను (సుమారు రూ. 240 కోట్లు) గెలుచుకుని వార్తల్లో నిలిచారు. ఆ అదృష్టవంతుడి పేరు అనిల్‌కుమార్ బోళ్ల (29). చాలాకాలంగా అబుదాబిలో ఉంటున్న అనిల్‌కుమార్‌కు లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే ఈ నెల 18న జరిగిన లక్కీ డే డ్రాలో ఆయన విజేతగా నిలిచారు. తనకు జాక్‌పాట్ తగిలిన విషయాన్ని మొదట నమ్మలేకపోయానని ఆయన తెలిపారు. జాక్‌పాట్ గెలిచారంటూ కాల్ వచ్చినప్పుడు వెంటనే నమ్మలేకపోయాను. ఈ రోజుకూ ఇది నిజమా కాదా అనిపిస్తోంది అని అనిల్ తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. తన విజయ రహస్యాన్ని పంచుకుంటూ, ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. అందరిలానే టికెట్ కొన్నాను. కానీ, అందులో ఆఖరి నంబరు చాలా ప్రత్యేకం. మా అమ్మ పుట్టినరోజునే ఆ నంబరుగా ఎంచుకున్నాను అని చెక్కు అందుకున్న సందర్భంగా అనిల్ వివరించారు. ఈ భారీ మొత్తాన్ని ఏం చేయబోతున్నారని అడగ్గా, తెలివైన పెట్టుబడులు పెట్టడంతో పాటు తన చిరకాల కోరికైన సూపర్ కారు కొంటానని చెప్పారు. కుటుంబసభ్యులను యూఏఈకి తీసుకొచ్చి వారితో కలిసి ఇక్కడే స్థిరపడతానని, వారి కోరికలు తీరుస్తానని తెలిపారు.

అలాగే, గెలిచిన డబ్బులో కొంత భాగాన్ని ఛారిటీలకు విరాళంగా ఇస్తానని తన దాతృత్వాన్ని చాటుకున్నారు. యూఏఈలో లాటరీపై ఎలాంటి ఆదాయపు పన్ను ఉండదు. దీంతో అనిల్ పూర్తి మొత్తాన్ని, అంటే రూ. 240 కోట్లను పన్ను చెల్లించకుండానే అందుకుంటారు. అదే భారత్‌లో ఎవరైనా ఇంత పెద్ద మొత్తం గెలిస్తే, దాదాపు 30 శాతం ఫ్లాట్ పన్ను, సర్‌చార్జ్, సెస్ రూపంలో సుమారు రూ. 86 కోట్లకు పైగా ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేది. పన్నులన్నీ పోగా, విజేతకు దాదాపు రూ. 154 కోట్లు మాత్రమే చేతికి అందేవి. కాగా, ఇదే డ్రాలో మరో 10 మంది కూడా తలా 10 వేల దిర్హామ్‌లు (రూ. 24 లక్షలు) గెలుచుకోవడం విశేషం.

# ప్రపంచశాంతికి భారత్, జపాన్ సంబంధాలు కీలకం

- జపాన్ కొత్త ప్రధాని తకైచితోఫోన్‌లో అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ, అక్టోబరు 30 :** భారత్ -జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, రక్షణ రంగంలో సహకార సంబంధాలను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. భారత్-జపాన్ సంబంధాలు ప్రపంచ శాంతి, స్థిరత్వం, సమృద్ధికి కీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు జపాన్ ప్రధాని సనాయి తకైచితో జరిగిన సంభాషణను ఎక్స్ వేదికగా మోడీ పంచుకున్నారు. జపాన్ తొలి మహిళా ప్రధానిగా ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టిన తకైచికి అభినందనలు తెలియజేశారు. "జపాన్ ప్రధాని సనాయె తకైచితో ఆత్మీయ సంభాషణ జరిగింది. దేశంలో అత్యుననత పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమెకు అభినందనలు తెలియజేశాను. న్యూఢిల్లీ- టోక్యో మధ్య లోతైన భాగస్వామ్యాన్ని నొక్కిచెప్పిన ఈ చర్చ, ఆర్థిక భద్రత, రక్షణ సహకారంపై సాగింది. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సమృద్ధి కోసం ఇరుదేశాల సంబంధాలు చాలా ముఖ్యమని అంగీకరించాం" అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. మరోవైపు "జపాన్- భారత్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడం కోసం మీతో కలిసి పని చేయాలని కోరుకుంటున్నాం" అని సనాయె తకైచి పోస్ట్ చేశారు. "భారత ప్రధానమంత్రితో ఆహ్లాదకరమైన సంభాషణ జరిగింది. జపాన్ ప్రధానమంత్రిగా నా నియామకంపై ఆయన అభినందన సందేశానికి చాలా కృతజ్ఞుడను. ఆయనతో కలిసి జపాన్- భారత్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ బాగస్వామ్యంలో ఒక కొత్త సువర్ణ అధ్యాయాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నా" అంటూ తకైసి రాసుకొచ్చారు.

# తప్పుడు అభియోగాలతో శిక్ష అనుభవిస్తే నిర్దోషులకు ప్రభుత్వ పరిహారం

## పరిశీలిస్తున్న సుప్రీం



**న్యూఢిల్లీ, అక్టోబరు 30 :** తప్పుడు అభియోగాలతో అన్యాయంగా జైలు శిక్ష అనుభవించిన నిర్దోషులకు నష్టపరిహారం చెల్లించే అంశంపై సుప్రీంకోర్టు తీవ్రంగా దృష్టి సారించింది. వ్యవస్థ తప్పిదాల వల్ల బలిపశువుగా మారిన వ్యక్తి, విలువైన జీవితాన్ని కోల్పోయినప్పుడు పరిహారం అందించేందుకు ఒక పటిష్టమైన విధానాన్ని రూపొందించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ ప్రక్రియలో ఉన్న చట్టపరమైన సంక్లిష్టతలను అధిగమించేందుకు తమకు సహాయం చేయాల్సిందిగా అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను కోరింది.

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మైనర్ బాలికపై అత్యాచారం, హత్య కేసులో తప్పుడు ఆరోపణలతో 12 ఏళ్ల జైలు జీవితం గడిపిన ఓ నిరుపేద వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ కేసులో థానే కోర్టు అతనికి 2019లో మరణశిక్ష విధించింది. అయితే, సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీంకోర్టు అతన్ని నిర్దోషిగా తేల్చి ఇటీవల విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తాను కోల్పోయిన 12 ఏళ్ల జీవితానికి పరిహారం ఇప్పించాలని కోరుతూ బాధితుడు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. బాధితుడి తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. ఇలాంటి కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది. జైలు జీవితం వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే. దీనిపై కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన కోరారు. ఈ అంశంపై ఒక స్థిరమైన ఏర్పాటు అవసరమని గతంలో లా కమిషన్ కూడా సిఫార్సు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ధర్మాసనం దేశంలో శిక్షలు పడుతున్న కేసుల శాతం కేవలం 54గా ఉండటాన్ని గుర్తుచేసింది.

తప్పుడు సాక్ష్యాలు సృష్టించడం లేదా వ్యవస్థ బాధితుడిని బలిపశువును చేయడం వంటి సందర్భాల్లో పరిహారం అంశాన్ని పరిగణించాలని భావిస్తున్నట్లు ధర్మాసనం సూచనప్రాయంగా తెలిపింది.

ఇదే ధర్మాసనం, మానసిక వైద్య చట్టం 2017 అమలుపై దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి బదిలీ చేసింది.

# సంక్షిప్తంగా..

## కర్ణాటక పోలీసులకు కొత్త టోపీలు



**బెంగళూరు, అక్టోబరు 30 :** రాష్ట్రంలో పోలీసులు వాడుతున్న క్యాప్‌ను మార్చాలని నేనే సూచించానని సీఎం సిద్ధరామయ్య అన్నారు. విధానసౌధలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు కొత్త టోపీల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు. పీక్ క్యాప్‌ను కానిస్టేబుళ్లకు ధరింపచేసి ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 1956 నుంచి స్లోచ్ క్యాప్‌లను వాడుతున్నారన్నారు. 70ఏళ్లుగా ఉన్న విధానంలో మార్పు తీసుకొచ్చామన్నారు. అధికారులు, పోలీసులు ఒకే విధమైన క్యాప్ ధరించడం సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనేది తన ఆశయమని సీఎం సిద్ధరామయ్య అన్నారు.

## బిజెపి నేత హత్యకేసులో నిందితుల అరెస్టు

**భోపాల్, అక్టోబరు 30 :** బీజేపీ నేతను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటకీయ ఎన్‌కౌంటర్ తర్వాత వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కాల్పుల్లో గాయపడిన హంతకులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో కాట్ని జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ జిల్లా పిచ్ఛా మోర్చా మండల అధ్యక్షుడు నీలేష్ రజక్ మంగళవారం హత్యకు గురయ్యారు. కైమోర్‌లోని మార్కెట్ వద్ద బైక్‌పై వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. బైక్‌పై వచ్చిన ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు గన్‌తో కాల్పులు జరిపి రజక్‌ను హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. అక్రమ్ ఖాన్, ప్రిన్స్ జోసెఫ్‌లను నిందితులుగా గుర్తించారు. కాట్నిలోని కజ్వారా సమీపంలో హైస్పీడ్ ఛేజింగ్ తర్వాత పోలీసులు వారిని చుట్టుముట్టారు. నిందితులు కాల్పులు జరుపగా ప్రతిగా కాల్పులు జరిపారు.

## భారత్, పాక్ ఘర్షణల్లో కూలిపోయిన ఏడు కొత్త విమానాలు

**టోక్యో, అక్టోబరు 30 :** భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణల్లో ఏడు కొత్త విమానాలు కూలిపోయినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ విమానాలు ఏ దేశానికి చెందినవో ఆయన స్పష్టం చేయలేదు. రెండు న్యూక్లియర్ పవర్ దేశాల మధ్య రగిలిన చిచ్చును వాణిజ్యంతో ఆపేసినట్లు ట్రంప్ మరో సారి పేర్కొన్నారు. టోక్యోలో వ్యాపారవేత్తలతో జరిగిన డిన్నర్ పార్టీలో ట్రంప్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏడు విమానాలను కూల్చేశారని, ఏడు విమానాలు కొత్తవే అని, అందమైన ఆ విమానాలను నేలకూల్చారని, రెండు అణ్వాయుధ దేశాలు ఆ ఫైట్‌లో నిమగ్నమైనట్లు ట్రంప్ చెప్పారు. అయితే పాకిస్థాన్, భారత్ మధ్య మొదలైన యుద్ధానికి వాణిజ్యంతో బ్రేక్ వేసినట్లు ట్రంప్ తెలిపారు. భారత్‌తో ట్రేడ్ డీల్ చేస్తున్నానని, ప్రధాని మోదీ పట్ల తనకు ప్రేమ, గౌరవం ఉందన్నారు. తమ మధ్య మంచి రిలేషన్ ఉందన్నారు.

## రజనీకాంత్ రిటైర్మెంట్ ప్రకటిస్తున్నారా?



**చెన్నై, అక్టోబరు 30 :** భారతీయ సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్ అనే పదానికి చిరునామాగా నిలిచిన రజనీకాంత్ సినిమాల నుంచి తప్పుకోనున్నారంటూ ఆయన రిటైర్మెంట్‌పై కోలీవుడ్ వర్గాల్లో మరోసారి జోరుగా చర్చ జరుగుతోంది.

75 ఏళ్ల వయసులోనూ యువ హీరోలతో పోటీపడుతూ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న తలైవా, త్వరలోనే నటనకు స్వస్తి పలకనున్నారనే వార్తలు ఆయన అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం రజినీకాంత్ జైలర్ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న జైలర్ 2 షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత గతంలో అరుణాచలం వంటి బ్లాక్‌బస్టర్ అందించిన దర్శకుడు సుందర్ సి దర్శకత్వంలో ఓ ప్రాజెక్టుకు అంగీకరించినట్లు సమాచారం.

## కాంగ్రెస్ సమావేశంలో బంగ్లా జాతీయ గీతం ఆలాపన!

**గువాహతి, అక్టోబరు 30 :** అసోంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆ పార్టీ నేత బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని ఆలపించడం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కరీంగంజ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో, భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. కరీంగంజ్‌లో జరిగిన కాంగ్రెస్ సేవాదళ్ సమావేశంలో పార్టీ నేత బిదు భూషణ్ దాస్ బంగ్లాదేశ్ జాతీయ గీతమైన అమర్ సోనార్ బంగ్లాను పాడారు. ఈ దృశ్యాలు వీడియో రూపంలో సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రేమను తెలియజేస్తోందని ఘాటుగా విమర్శించింది. ఈ ఘటనపై అసోం మంత్రి కృష్ణేందు పాల్ స్పందిస్తూ, ఇది చాలా వింతైన సంఘటన అన్నారు.

## గుంటూరు జిల్లాలో టాస్క్ ఫోర్స్ దాడులు



○ వ్యభిచార ముఠా, సింగిల్ నంబర్ లాటరీ గుట్టురట్టు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**:అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన లక్ష్యంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం నిరంతర దాడులు కొనసాగిస్తోంది.

గురువారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటలకు టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన సమాచారం ఆధారంగా కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటూరు వారి తోట 8వ లైన్లో గెస్ట్ రూమ్స్ పేరుతో పనిచేస్తున్న ఒక హోటల్‌పై ఆకస్మిక దాడి చేశారు. హోటల్‌లో ఆర్గనైజింగ్ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తేలడంతో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు కలిపి మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న నాలుగు సెల్ ఫోన్లను సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎస్సై సుబ్బారావుకు అప్పగించారు.

అదే విధంగా పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నందివెలుగు రోడ్డులోని మసీదు సమీపంలో సింగిల్ నంబర్ లాటరీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించడంతో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో వనిమిరెడ్డి నంది మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి రూ. 1,940 నగదు సీజ్ చేశారు. అనంతరం తగిన చర్యల కోసం పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## వికలాంగురాలికి 15వేలు పింఛన్ ఇవ్వాలి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)**బ్రహ్మంగారిమఠం మండలం నరసన్న పల్లె గ్రామంలోని వికలాంగురాలైన ధనలక్ష్మి కి 15000 పింఛన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం వారు నరసన్నపల్లె లోని ధనలక్ష్మి కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం మండలం నరసన్నపల్లె గ్రామంలోని ధనలక్ష్మి వికలాంగురాలు కు పూర్తిగా కాళ్ళు, చేతులు పనిచేయక మంచానికే పరిమితమైందన్నారు. సదరం సర్టిఫికెట్ లో కూడా 100% పర్సంటేజ్ వచ్చినా కూడా అధికారులు 15 వేలు పింఛన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ధనలక్ష్మి మంచానికే పరిమితమైన కూడా కూటమి ప్రభుత్వం 6వేలు మాత్రమే పింఛన్ ఇవ్వడం దారుణమన్నారు. పింఛన్ పంపిణీలో ఆర్భాటం చేస్తున్న కూటమి ప్రభుత్వం నిజమైన వికాలాంగురాలుకు న్యాయం చేయడంలో కూటమి ప్రభుత్వం, అధికారులు విఫలం చెందారని వారు అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ధనలక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధనలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సాన గోవింద్ స్వామి రెబ్బ నరసింహులు పాల్గొన్నారు.

## అంటువ్యాధుల నివారణకు చర్యలు వేగవంతం



○ తుఫాను అనంతరం కమిషనర్ పర్యటన

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :మొంథా తుఫాను అనంతరం వర్షాల ప్రభావంతో నగరంలో అంటువ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు అన్ని విభాగాల సమన్వయంతో చర్యలు చేపట్టాలని గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన చుట్టగుంట సమీపంలోని మురికిపేట, ఏటి అగ్రహారం ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు జారీ చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వెంటనే నీటిని బెయిల్ అవుట్ చేయాలని, చెత్త తొలగించి శుభ్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల లార్వా పెరగకుండా ఆయిల్‌బాల్స్ వేయడంతో పాటు మలాథియన్ పిచికారీ చేయాలని తెలిపారు. శుభ్రం చేసిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పొడి చల్లాలని, అత్యవసర మరమ్మత్తులు అవసరమైన రోడ్లు, కాలువల పట్ల ప్రాధాన్యత ఇచ్చి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, సచివాలయ విభాగాలతో సమన్వయం చేసి మున్సిపల్ సిబ్బంది ప్రక్రియలను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. పర్యటనలో ఎస్ఎస్ అంగడి రాజేష్‌తో పాటు వివిధ శాఖా అధికారులు పాల్గొన్నారు.

## విపత్తు సమయంలో... ప్రజలకు భరోసా కూటమి ప్రభుత్వ విధానం

○ పునరావాస కేంద్రాలలో ప్రభుత్వసాయం

○ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** : విపత్తు మనచేతిలో ఉండదని ప్రకృతి ప్రకోపానికి అనుగుణంగాఏర్పడే విపత్తుల సమయంలో, రాష్ట్ర ప్రజలకు ఓ బరోసా కల్పించే తీరుగా, మొంథా తుఫాను విషయంలో కూటమి ప్రభుత్వం ద్వారా,క్షేత్రస్థాయిలో ఉంటూ మెరుగైన సేవలు అందించిన అందరికి ధన్యవాదాలని, పునరావాస కేంద్రాలలోని వారికి, బియ్యం, నగదు, నిత్యావసరాలు పంపిణీ చేపట్టిన క్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

స్థానిక 23వ, వార్డు పరిదిలోని సి ఎమ్, కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, మంత్రి నాదెండ్ల మనోహర్, 8,పునరావాస కేంద్రాలలో ఉన్న,615మందికి, ఒక్కోకుటుంబానికి 25,కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, 3,వేలునగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన, సభకు మున్సిపల్ కమీషనర్ అప్పల నాయుడు స్వాగతం పలుకగా, మంత్రి నాదెండ్ల మనోహర్ తొ, పాటుగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ, సబ్ కలెక్టర్ సంజనా సింహ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతు మొంథా తుఫాన్ ద్వారా ఎదురయ్యె సమస్యలను అధిగమించే దిశగా, అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయికి వెళ్ళి, ప్రజలతొ మమేకమవుతు, ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విషయంలొ శ్రమించిన ప్రతి ఒక్కరికి, పేరు, పేరున ప్రభుత్వం తరపున ధన్యవాదాలని అన్నారు. దేవునిదయతొ ప్రాణ నష్టం లేకుండా బయట పడ్డామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తుఫాను బాదితులైన, పునరావాస కేంద్రాల వారికి, నిత్యావసరాలు, బియ్యం, నగదు కూడా అందజేస్తున్నామని తెలిపారు. మత్యకారులకు, చేనేత కార్మికులకు, 50కిలోలు రైస్ పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి చెప్పారని అన్నారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ మాట్లాడుతు జిల్లాలొ తుఫాన్ కారణంగా 25,వేల ఎకరాలలొ పంటనష్టం జరిగిందన్నారు. పంటనష్టం అంచనాల ప్రక్రియ పూర్తి కాగానె, త్వరలోనె పంట నష్ట పరిహారం అందజేస్తామన్నారు. జిల్లాలొ 9400మంది, పునరావాస కేంద్రాల వారికి, నిత్యావసరాలు, బియ్యం, నగదు అందజేస్తామన్నారు. పునరావాస కేంద్రాలలొ ఉన్న అన్ని కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సమయస్పూర్తితొ, ముందస్తు జాగ్రత్తలు చేపట్టడం తొ, తుఫాన్ నష్టం పెరగకుండా అడ్డుకోగలిగామని అన్నారు. మండలంలోని పెదరావూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో, పునరావస కేంద్రంలో ఉన్నవారికి మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ తదితర అధికారులు, బియ్యం నిత్యవసర సరుకులు, 3000 రూపాయలు నగదు వంతున పంపిణీ చేశారు. కార్యక్రమంలొ, తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, వివిధ విభాగాల సిబ్బంది, వార్డు స్థాయి ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీ

○ పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :మొంథా తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున నిత్యావసర సరుకులను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం పంపిణీ చేశారు. ఏటి అగ్రహారం ప్రాంతంలోని రేషన్ షాపు వద్ద బాధితులకు ప్రభుత్వం తరఫున బియ్యం, పప్పు, నూనె, కూరగాయలు, పంచదార, ఉల్లిపాయలు వంటి నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా ఏపీ ప్రజలు ఒక విపత్కర పరిస్థితిని కలిసికట్టుగా చాలా సమర్థవంతంగా ఈ మొంథా తుఫాన్‌ని ఎదుర్కొన్నాము. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ , పవన్ కళ్యాణ్ నిరంతర సమీక్షా సమావేశాలు నిర్వహించడంతో, రాష్ట్రవ్యాప్తంగా ఈ తుఫాన్‌ని ఎంత ప్రణాళికబద్ధంగా ఎదుర్కొన్నామో ప్రజలందరూ చూశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ప్రాణ నష్టం, ఆస్తి నష్టం పెద్దగా లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. అయినప్పటికీ కొంతమంది లోతట్టు ప్రాంత ప్రజలు ముంపుకు గురయ్యారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 325 మంది తుఫాన్ బాధితులు గత రెండు రోజులుగా రిహాబిలిటేషన్ సెంటర్లలో ఆశ్రయం పొందారు.

బాధితులందరికీ ప్రభుత్వం తరఫున ఈ రోజు ఏటి అగ్రహారంలో 60 మందికి నిత్యావసర సరుకులు అందజేస్తున్నాం. పంపిణీ చేయటం జరిగిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

అధికారులు, స్థానిక డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు అందరం కలిసి బాధిత కుటుంబాలందరికీ సరుకులు అందేలా చూస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ప్రజలు ఈ సహాయక చర్యల పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. కిందస్థాయి కార్యకర్తల నుండి సీఎం వరకు ప్రతి ఒక్కరూ నిరంతరం పర్యవేక్షించారు. ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే స్పందించారు. మా కార్యకర్తలు, కార్పొరేటర్లు ప్రజలతోనే ఉండి సేవ చేశారు. అందుకే ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోగలిగాము," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ప్రజల కోసం, ప్రజా శ్రేయస్సు కోసం కూటమి ఎప్పటికీ నిలబడే ప్రభుత్వం. అందుకే ప్రజలు ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికే జై కొడతారు. ఈ తుఫాన్ సహాయక చర్యల్లో మాకు అండగా నిలిచిన కమిషనర్ , అసిస్టెంట్ కమిషనర్, ఎంఆర్ఓ , ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

తుఫాన్ అనంతరం అనేక ప్రాంతాల్లో డ్రైనేజ్, సిల్టేషన్, శానిటేషన్ సమస్యలు, చెట్లు పడిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి అంశాలను రెండు మూడు రోజుల్లోనే అధికారులు సమర్థవంతంగా పరిష్కరించారు. ఇకపై ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని ప్రాంతాల్లో శుభ్రత, విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు కొనసాగుతాయి," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

## అంటూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : చేబ్రోలు ఎంపీడీవో



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అంటూ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవలసిన బాధ్యత పంచాయితీలపై ఉందని చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి ఊహారాణి చెప్పారు . కొద్దిరోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు, తుఫాన్ అనంతరం పారిశుధ్య పనులు సమర్థవంతంగా చూసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు.

గురువారం డిప్యూటీ ఎంపీడీవో, ఏ ఈ ఆర్డబ్ల్యూఎస్ , ఎం సి ఓ , ఎస్ బి ఎం లను కలుపుకొని పాత రెడ్డిపాలెం మరియు కొత్త రెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటన సందర్భముగా ఆమె మాట్లాడుతూ త్రాగునీరు మరియు పారిశుద్ధ్యం దిశగా దృష్టి సారించిన పంచాయితీ కార్యదర్శులు సూపర్ శానిటేషన్ , సూపర్ క్లోరినేషన్ చేసి ప్రజలకు త్రాగు నీరు సరఫరా జరుగుతుందని తెలిపారు. వర్షపు నీటితో రోడ్లపైకి కొట్టుకొచ్చిన పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమంగా పెట్టుకొని తొలగించామన్నారు. వర్షపు నీరు నిల్వలు లేకుండా మురుగు పారుదల సౌకర్యాలను పునరుద్ధరించే పనులను ముమ్మరం చేశామన్నారు . నీటి నిల్వలను తొలగించేందుకు వీలు లేని పరిస్థితుల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల వ్యాప్తి నివారణకు పనులపై సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు .100% ఈపనులు పూర్తి చేసేలాగా తుఫాను చివరి దశలో గ్రామాల్లోని విరిగిపడిన , కూలిపోయి చెట్లలను వెంటనే తొలగించామన్నారు. ఈ ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజలు నీటిని కాచి చల్లార్చిన తరువాత తాగే విధంగా అవగాహన కల్పింస్తున్నామన్నారు . గ్రామంలో అన్ని రకాల పారిశుధ్య కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని అన్నారు . అవసరమైన చోట తప్పనిసరిగా బ్లీచింగ్ కూడా చల్లాలని సూచించారు . తుఫాన్ తర్వాత పారిశుధ్య కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అంటూ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పర్యటనలో వాటర్ స్కీముకు సంబంధించిన , ట్యాంక్ పరిసరాలు , నీటి నాణ్యత పరీక్షలు , రిజిస్టర్లు , పారిశుధ్య పనులు పరిశీలించారు.

కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్ , ఏ ఈ ఆర్ డబ్ల్యు ఎస్ పి శ్రీనివాసరావు , ఎం సి ఓ ఎస్ బి ఎం ప్రసాద్ , పంచాయతీ కార్యదర్శులు , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలను కంటికి రెప్పలా కాపాడాం



○ ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూశాం

○ తుపాను బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

○ హాజరైన మేయర్ కోవెలమూడి నాని, కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక చౌత్రా సెంటర్ లోని పాల కేంద్రం వద్ద పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు మేయర్ కోవెలమూడి నాని, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో భోజన వసతి, మంచినీరు, పాలు సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. తుపాను ప్రభావ ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం పెద్ద మనస్సుతో చర్యలు చేపట్టిందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు అర్ధరాత్రి సమయంలో కూడా రాష్ట్రంలో తుఫాను ప్రభావాన్ని పరిశీలిస్తూ అధికారులకు, నాయకులకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో రేయింబవళ్లు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పరిస్థితిని సమీక్షించానని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్రంలో ఆస్తి, ప్రాణ లేకుండా చేయగలిగామని తెలిపారు. ఒక కుటుంబానికి రూ. 3 వేలు, ఒక వ్యక్తికి ?1000 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు రూ. 3 వేలు విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను అందించామని అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 25 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుపానుకు చిత్తశుద్ధితో పని చేసిన అధికారులకు, పార్టీ నాయకులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షజిలా, కార్పొరేటర్ చిష్టి, మొహమ్మద్ హఫీజ్, డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ సలీం, కొణిదె దుర్గ, ఎస్ఎస్ పి జాదా, బద్రీనాధ్, షాహిముల్లా తదితరులు పాల్గొన్నారు .

## ప్రభుత్వం ఆదుకుంటుంది: జవ్వాది



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)**: ఇటీవలి తుఫాన్ బీభత్సం కారణంగా మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామం నుండి నూతక్కి వెళ్లే మార్గమధ్యంలోని తమలపాకు పొలం (6.30 ఎకరాలు) తీవ్రంగా దెబ్బతింది. ఈ పొలంలో సుమారు 50 కుటుంబాలు తమలపాకు సాగు ద్వారా జీవనం సాగిస్తున్నాయి. గాలివానలు, భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు గత 20 సంవత్సరాలుగా తమలపాకు సాగు చేస్తున్నప్పటికీ ఇంత భారీ నష్టం ఎప్పుడూ చూడలేదని తెలిపారు. పంట నష్టంతో ఆదాయ మార్గం పూర్తిగా మూసుకుపోవడంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని గమనించిన మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ గురువారం నాడు నష్టపోయిన పొలాలను సందర్శించి రైతులను పరామర్శించారు. పంట నష్టాన్ని ప్రత్యక్షంగా గమనించిన ఆయన మాట్లాడుతూ, "రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంత్రి నారా లోకేష్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా నష్టపోయిన రైతులను ఆదుకుంటుంది" అని తెలిపారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాలపై పూర్తి స్థాయిలో అంచనా వేయించి, రైతులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జవ్వాది కిరణ్ స్పష్టం చేశారు. తమలపాకు పొలం సందర్శించిన వారిలో మాదల రమేష్ బాబు, జనసేన నాయకులు చింతల ఏడుకొండలు,రైతులు ఉన్నారు.

## కాకుమాను లో పర్యటించిన బలసాని



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్)**:వరద ప్రభావితం అయిన ప్రాంతాలలో వైస్సార్సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జి బలసాని. కిరణ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కాకుమాను మండలంలోని అప్పాపురం, రేటూరు గ్రామాల పరిధిలో వరద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ వర్షాల కారణంగా నల్లమడ వాగు నుండి వచ్చే వరద నీరు పంటపొలాల్లోకి చేరి సుమారు 4 వేల నుండి 5 వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయని తెలిపారు. పరిస్థితులను పరిశీలించి, ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. నష్టపోయిన ప్రతి రైతుకూ తక్షణ నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇన్పుట్ సబ్సిడీ పూర్తి స్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. పునరావస కేంద్రాల్లో ఉన్నవారికి సరైన వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ మరియు కాకుమాను మండల, అప్పాపురం, రేటూరు గ్రామాల వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తుఫానుకు గురైన పంటలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

○ జిల్లా వ్యవసాయ అధికారి సూచనలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** తుఫాను వలన ముంపుకు గురైన పంటలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పత్తి రైతులు వీలైనంత త్వరగా నీరు తొలగించి అంతర కృషి చేసి, నేల ఆరునట్లు చేయాలన్నారు. అధిక తేమ వలన మొక్కలు భూమి నుండి పోషకాలను గ్రహించే స్థితిలో వుండవని, అటువంటి పరిస్థితులలో మొక్కలు ఎర్రబడటం, వడలటం, ఎండిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు 2% (20 గ్రా) యూరియా లేదా 2% (20గ్రా) పొటాషియం నైట్రేట్ను 1% (10 గ్రా) మెగ్నీషియం సల్ఫేట్ తో లీటరు నీటికి కలిపి 5-7 రోజుల వ్యవధితో రెండు మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. పిచికారీ ఎండ వున్న సమయంలో మాత్రమే చేయాలని, చల్లగానున్న సమయంలో పిచికారీ చేసినట్లయితే, నీటిముంపునకు గురైన మొక్కలు పోషకాలను సమర్థవంతంగా తీసుకోలేవని చెప్పారు. రెండు శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయటం ద్వారా పొటాషియం, నత్రజని లోపాలను సవరించవచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ ఎక్కువగా వుండటం వలన పురుగులు, తెగుళ్ళ వ్యాప్తి చెందటానికి అవకాశం వుందని, అందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 3గ్రా మాంకోజెట్ లేక కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. తెగులు సోకిన పొలంలో లీటరు నీటికి 1 మి. లీ ప్రొపికొనజోల్ లేక కాప్టాను, 1గ్రా హెక్సాకొనజోల్ కలిపి 15 రోజుల వ్యవధిలో చల్లుకోవాలని సూచించారు.

ప్రత్తిలో కాయకుళ్ళు నివారణకు లీటరు నీటికి 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. పొటాషియం నైట్రేట్ను ఏ పురుగు మందు/ తెగులు మందులోనైనా కలిపి పిచికారి చేసుకోవచ్చని చెప్పారు. ప్రత్తి పంటను ఎటువంటి పరిస్థితులలో కూడా 150 - 160 రోజుల తర్వాత పొడిగించరాదని స్పష్టం చేశారు. ప్రత్తి మోళ్ళను షెడ్డరుతో భూమిలో కలియ దున్నుకోవాలని పేర్కొన్నారు.

**పెరుగుదల దశలో వరి పైరుకు**

ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటికి పంపించాలని చెప్పారు.

ఒక ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పై పాటుగా వేయాలన్నారు. వరిలో పాముపొద తెగులు ఉధృతి ఎక్కువ కావడానికి అవకాశము ఉందని, ఈ తెగులు దుబ్బు చేసిన దశ నుండి ఆకులపై మచ్చలు ఏర్పడతాయన్నారు. ఉధృతి ఎక్కువైతే మొక్కలు ఎండిపోతాయని, నివారణకు ప్రొపికొనజోల్ ఒక మి. లీ లేక వాలిడామైసిన్ లేదా హెక్సాకొనజోల్ 2 మి. లీ లీటరు నీటిలో కలిపి దబ్బు బాగా తడిచేలా 15 రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. ముంపు పరిస్థితులు నెలకొన్నప్పుడు అగ్గి తెగులు ఉధృతికి వాతావరణము అకూలంగా ఉంటుందని, అగ్గి తెగులు సోకినప్పుడు ముదురు ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎర్రబడతాయని తెలిపారు. క్రమేణా మచ్చలు కలిసిపోయి వంట ఎండిపోయినట్లు ఉంటుందన్నారు. దీనిని నివారించుటకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా క్లాసుగామైసిన్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో జింక్ లోపం ఉంటే వరి నాటిన రెండు నుండి ఆరు వారాల్లో ముదురాకు చివర్లలో ఈనేకు ఇరుప్రక్కల త్రుప్పు లేక ఇటుక రంగు మచ్చలు కనపడతాయన్నారు. ఆకులు చిన్నవిగా పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయని చెప్పారు. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవని, లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ను కలిపి మూడు రోజుల వ్యవధిలో 2 లేక 3 సార్లు సిచికారీ చేయాలని వివరించారు.

**పొట్ట దశలో వరి పైరుకు**

పొలాల్లో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని కోరారు. వాలిపోయిన చేనులో నాలుగైదు దుబ్బులు చొప్పున కలిపి కట్టి పైరుని నిలబెట్టాలని తెలిపారు. లేవదీసి కట్టిన చేనుకు పొడ తెగులు ఆశించే అవకాశం ఎక్కువ, దీని నివారణకు ప్రొపికొనజోల్ 1 మి. లీ. లేక వాటిలామైసిన్ 2 మి. లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి. లీ లీటరు నీటిలో కలిపి దబ్బు బాగా తడిచేలా 15 రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. వరి పొలంలో అధిక నీటి ప్రవాహం తరువాత సుడి దోమ ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, దోమ ఉధృతి ఎక్కువైనప్పుడు నివారణకు 2 మి. లీ ఇతోఫెనాక్స్ లేదా 1.5 గ్రా. ఎసిపేట్ లేదా 0.25 మి. లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.20 గ్రా. థయోమిథోక్సామ్ లేదా 0.25గ్రా. డైనెటోఫ్యురాన్ లేదా 1.6 మి.లీ. బిప్రొఫ్యూజిన్ లేదా 0.6 మి.లీ. పైమెట్రోజన్ లేదా 2.2 మి.లీ. మోనోక్రోటోఫాస్ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. పొలాన్ని అడపా దడపా అరబెట్టాలని పేర్కొన్నారు.

**వరి పంట కోత దశలో వర్షాల వలన గింజలు మొలకెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు**

కోతకు ముందు వర్షాలు వస్తే వరి వెన్నుల మీద ఐదు శాతం ఉప్పు నీరు (లీటరు నీటికి 50 గ్రా. ఉప్పును కలిపి) పిచికారీ చేయాలన్నారు. పైరు పనల మీద తడిస్తే ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 50గ్రా. ఉప్పు)వెన్నులపై పిచికారి చేయాలని లేదా ఎకరానికి 10-15 కిలోల మెత్తటి ఉప్పును పనలపై చల్లాలని, ఇలా చేస్తే 10-15 రోజుల వరకు గింజలు పాడవ్వకుండా ఉంటాయన్నారు. ఉప్పు ద్రావణం పిచికారి వీలుకాని పక్షంలో తడిచిన పనలను ఆరనిచ్చి కుప్పలుగా వేసేటప్పుడు ఉప్పు పొడిని కంకుల మీద చల్లాలని సూచించారు. నూర్చిన తర్వాత వరి ధాన్యం తడిస్తే క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 4 కిలోల ఊక లేదా ఎండుగడ్డి చిన్న చిన్న ముక్కలుగా చేసి కలిపి కుప్పగా పోసి వారం రోజుల తర్వాత అరబెట్టాలన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# దమ్ము ధైర్యం ఉంటే జగన్ బహిరంగ చర్చకు రావాలి

- జగన్ రెడ్డి మళ్లీ అబద్ధాలతో ప్రజలను మోసం చేయాలనే ప్రయత్నం
- జగన్ బుద్దిలేకుండా, కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడంటూ మండిపడ్డ మంత్రి అచ్చెన్నాయుడు
- రాష్ట్రంలో 95% ఈ క్రాప్ నమోదైంది, నవంబర్ 12 లోపు మిగిలిన 5% పూర్తిచేస్తాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి మళ్లీ అబద్ధాల తుపాను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. తుఫాను ప్రభావం, పంటల నష్టంపై మాట్లాడే ముందు జగన్ తన పాలనలో రైతులకు చేసిన అన్యాయాలను గుర్తు చేసుకోవాలని మంత్రి సూటిగా ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమం పేరుతో మాట్లాడే హక్కు జగన్ రెడ్డికి లేదు. ఆయన పాలనలోనే రైతులు కష్టాల బాట పట్టారు. ఉచిత పంట బీమా పేరుతో కోట్ల రూపాయల మోసం జరిగింది. బీమా కోసం రైతులు నెలల తరబడి తిరిగినా, ఒక్కరూపాయి పరిహారం కూడా అందలేదు. ఇప్పుడు బేషరతుగా బీభత్స గణాంకాలు చెప్పి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు అని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. జగన్ పేర్కొన్న ఇ-క్రాప్, ఆర్బీకే, సచివాలయ వ్యవస్థలు కేవలం రాజకీయ ప్రదర్శనలేనని, నేల మీద వాటి ఫలితం శూన్యమని మంత్రి తేల్చిచెప్పారు. మీ పాలనలో రైతులు నష్టపోయినా, పరిహారం ఇవ్వలేదు. మిర్చి, మామిడి, పొగాకు కొనుగోళ్లు చేస్తామన్నారు, కానీ ఒక్క రూపాయి చెల్లించలేదు. రైతుల చెమటను చెల్లని వాగ్దానాలతో తుడిచిన పాలన జగన్‌దే అని మంత్రి విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన అంచనా పనులు జరిపి, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, తక్షణ సహాయ చర్యలు, బీమా పరిహారాలు అందజేస్తోందని మంత్రి తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో రైతు కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మాటలు కాదు చర్యలతో మేము నిరూపిస్తున్నాం అని ఆయన స్పష్టం చేశారు.

**రైతు శ్రేయస్సేకూటమి ప్రభుత్వ ధ్యేయం** : రైతు కష్టసుఖాల్లో అండగా నిలవడం కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముడవుతున్న పంటలకు వెంటనే మార్కెట్ జోక్యాన్ని అందించేందుకు ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి రూ. 300కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేసిందన్న విషయం జగన్ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 800 కోట్ల వరకు పంటల మద్దతు ధరల కోసం ఖర్చు పెట్టాం అని మంత్రి వివరించారు. వైసీపీ హయాంలో 2020లో మిర్చి ధర రూ. 12,000 ఉన్నా, మద్దతు ధరగా రూ. 7,000 మాత్రమే నిర్ణయించి, ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని మంత్రి మండిపడ్డారు. హెచ్.డీ. బర్లీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు ప్రభుత్వం 271 కోట్లు వెచ్చించి 20 వేల మిలియన్ కిలోల కొనుగోలు నిర్ణయం తీసుకుందని, అదనంగా వచ్చిన పంట కూడా మేమే కొనుగోలు చేశామన్న విషయాన్ని జగన్ గుర్తు పెట్టుకోవాలని అన్నారు. కోకో ధరలు తగ్గడంతో కిలోకు ?50 చొప్పున చెల్లించాం. తోతాపూరి మామిడి ధరలు తగ్గినప్పుడు ?260 కోట్లు వెచ్చించి ప్రతి కిలోకు అదనంగా ?4 చొప్పున చెల్లించాం. టమాటా రైతులకు ధరలు పెరిగినప్పుడు వినియోగదారులకు సరసమైన ధరలు అందించడానికి ?8 కోట్లు వెచ్చించి రైతుల వద్ద నుండి 1781 మెట్రిక్ టన్నులు సేకరించి రైతు బజార్ల ద్వారా విక్రయించాం. అలాగే ధరలు తగ్గినప్పుడు ?3.25 కోట్లతో సుమారు 2800 మెట్రిక్ టన్నుల టమాటా కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కలిగించాం. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం 3780 మెట్రిక్ టన్నుల టమాటా సేకరించగా, మా ప్రభుత్వం కేవలం 14 నెలల్లోనే 4672 మెట్రిక్ టన్నులు సేకరించిందన్న విషయం జగన్ తెలుసుకోవాలని అన్నారు. కర్నూలు జిల్లాలో ఉల్లి ధరలు తగ్గిన నేపథ్యంలో, మా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని మార్క్‌ఫెడ్ మరియు మార్కెటింగ్ శాఖల ద్వారా రూ. 1200 క్వింటాకు కొనుగోలు చేశాం. కూటమి ప్రభుత్వం రైతు కష్టానికి అండగా ఉంది. రైతు ఉత్పత్తికి విలువ, శ్రమకు గౌరవం కల్పించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. మాటలు కాదు చర్యలతో రైతు పక్షపాతం నిరూపిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## జీజీహెచ్ అభివృద్ధికి డాక్టర్ యశస్వి రమణ కృషి అభినందనీయం



- హాస్పిటల్ కో-చైర్మన్, తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అభినందనలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ వైద్య సేవల రంగంలో నిబద్ధత, సేవాభావంతో ముందుకు సాగుతున్న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణకు ఆసుపత్రి అభివృద్ధి కమిటి కో-చైర్మన్, తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా గత ఏడాది కాలం పాటు పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఆసుపత్రి ప్రతిష్టను పెంచినందుకు ఆయన ప్రశంసలు కురిపించారు.

గురువారం జీజీహెచ్‌లో డాక్టర్ యశస్వి రమణను ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "తక్కువ వనరులతో కూడా ప్రజలకు అందుబాటు వైద్య సేవలు అందించేందుకు మీరు చూపిన కృషి అభినందనీయము. ఇదే జోష్‌తో ముందుకు సాగి జీజీహెచ్‌కు మరింత పేరు తీసుకురావాలని కోరుకుంటున్నా" అని తెలిపారు.

కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బొజ్జా వెంకటేశ్వరరావు, జీజీహెచ్ ఎడి పూసల శ్రీనివాసరావు, మినిస్టీరియల్ సిబ్బందితో పాటు పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## సంగం బ్యారేజ్ కు తప్పిన ముప్పు



- చాకచక్యంగా మూడో పడవను ఒడ్డుకు చేర్చిన యంత్రాంగం
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : మొంతా తుఫాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కొట్టుకువచ్చి సంగం బ్యారేజ్ సమీపానికి చేరిన పడవను గురువారం ఉదయం చాకచక్యంగా ఒడ్డుకు చేర్చినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని మొత్తం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దగ్గర ఉండి నిరంతరం అమూల్యమైన సలహాలు, సూచనలు ఇస్తూ పర్యవేక్షించారు.

ప్రమాద సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. హుటాహుటిన అధికారులను అప్రమత్తం చేసి, ప్రతి బృందానికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించారు.

మొత్తం 30 మంది చొప్పున ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, 100 మంది పోలీసు సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు గస్తీ బృందం, ఫైర్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంగా కృషి చేయడంతో పడవను సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగామని కలెక్టర్ వివరించారు..

ప్రవాహ ధాటికి తీసుకురాలేకపోయిన మూడవ పడవను గురువారం ఉదయం చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్న సమయంలో 30 టన్నుల పడవ ప్రాజెక్టుకు తగిలితే సంగం బ్యారేజ్ ఉనికే ప్రశ్నార్థకమయ్యేదని కలెక్టర్ అన్నారు. అంతేకాకుండా 85 గేట్లతో 3,85,000 ఎకరాలు ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తున్న సంగం బ్యారేజ్ కు ప్రమాదం జరిగి ఉంటే నీరు వృధాగా పోయి రాబోయే సీజన్ లో రైతులు నష్టపోయేవారన్నారు. అలాగే పొదలకూరు, సంగం గ్రామాలకు మధ్య రాకపోకలు స్థంభించేవని అన్నారు.

జిల్లా కలెక్టర్ సమయస్ఫూర్తి, సమర్ధ నిర్ణయాలతో ఎటువంటి ప్రమాదం లేకుండా సంగం బ్యారేజ్ ను, తద్వారా ప్రజలను కాపాడారని సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి జిల్లా ప్రజలందరి తరఫున జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అభినందనలు తెలియజేశారు.

బుధవారం (29వ తేది) భారీ వర్షాల తాకిడికి పై నుండి కొట్టుకువచ్చిన మూడు పడవలలో రెండింటిని అదే రోజు ఒడ్డుకు చేర్చిన విషయం తెలిసిందే. మిగిలిన మూడవ పడవ బ్యారేజికి ఎగువన 400 మీటర్ల దూరంలో పాత ఆనకట్ట క్రెస్ట్ అడ్డుకోవడంతో నిలిచిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే.

## తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు కీలక మలుపు తిరిగింది. కల్తీ నెయ్యి సరఫరా వెనుక భారీ కుట్ర ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్నఅప్పన్న అరెస్టుతో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. 2022 తితిదే కొనుగోళ్ల విభాగం జీఎంను అప్పన్న సంప్రదించారు. నెయ్యి సరఫరా చేసే భోలేబాబా డెయిరీ యాజమాన్యానికి ఫోన్ చేశారు. ప్రతి కిలో నెయ్యిపై రూ. 25 కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు భోలేబాబా డెయిరీ యాజమాన్యం నిరాకరించింది.

దీంతో ఆ డెయిరీపై అనర్హత వేటు వేసేలా చిన్నఅప్పన్న కుట్రకు తెరలేపారు. డెయిరీని తనిఖీ చేయాలంటూ తితిదే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. డెయిరీపై అనర్హతవేటు వేసేలా అజ్ఞాతవ్యక్తులతో పిటిషన్లు వేయించారు. చిన్నఅప్పన్న కుట్రతో బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరణను తితిదే నిలిపివేసింది.

ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ ప్రవేశించి.. రూ. 138 ఎక్కువ కోట్ చేసింది. పోటీ లేకపోవడంతో కాంట్రాక్టు దక్కించుకుంది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది.

## రైతుకష్టం నష్టం గుర్తించాం... ప్రభుత్వపరంగా అండగా ఉంటాం

- మంత్రి నాదెండ్ల మనోహర్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**మొంథాతుఫాన్ ఈదురు గాలుల కారణంగా నియోజక వర్గంలో ఆరువేల హెక్టార్లలో పంటనష్టం ఏర్పడిందని, రైతుల ఇబ్బందులను, కష్ట, నష్టాలను గుర్తించామని, రైతులలో నమ్మకం పెంచేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పంటపొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన క్రమంలో అన్నారు.

మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని పెదరావూరు శివారులో నేలకొరిగిన వరి పొలాలను, గురువారం మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ, తదితర అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులలో మనోధైర్యాన్ని, నింపుతు, వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వరి గింజ పాలుపోసుకునే సమయంలో, నేలకొరిగిందని, సమస్య తీవ్రతను రైతులు వివరించారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతు, రైతుల పరిస్థితి క్షేత్ర స్థాయిలో దయనీయంగా ఉందని, వారిలో నమ్మకం, బరోసా కల్పించె విధంగా, కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ క్రాఫ్ నమోదు చేసిన, ప్రతీ కౌలు రైతుకు, నష్టపరిహారం చెల్లించెలా, కేంద్రప్రభుత్వంతో మాట్లాడతా మన్నారు. నియోజకవర్గంలో, ఆరువేల, హెక్టార్ల మేర, వరి పంటనష్టం వాటిల్లిందని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశాన్ని ప్రస్తావిస్తు, క్వింటాల్ మంచిధాన్యం 2389,మద్దతు ధరతో, 48గంటల్లో నగదు, రైతు ఖాతాలో జమ అయ్యేలా, ఈసీజన్ లో,51లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. దళారుల వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేదన్నారు. సమస్యలుంటె ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు ఉద్యానవన పంటల సాగును అలవర్చుకోవావని, ఇతర జిల్లాలలో, మార్పును చూస్తున్నామని అన్నారు. మధ్యాహ్న భోజనం కోసం, బిపిటిలు, స్వర్ణమసూరి, ఉపయోగిస్తామన్నారు. కౌలు రైతులను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని అన్నారు. పంట పొలాల పరిశీలన కార్యక్రమంలో, సబ్ కలెక్టర్ సంజనసింహ, తహసిల్దార్ కె వి గోపాలకృష్ణ, వివిధ విభాగాల అధికారులు సిబ్బంది ఉన్నారు.

## నల్లమడ వాగు ను పరిశీలించిన ఎంఎల్ఏ రామాంజనేయులు



- కొండపాటూరు లో నల్లమడ వాగు పరిశీలన
- నల్లమడ ను ఆధునికరిస్తాం
- రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**కాకుమాను,( జర్నలిస్ట్ ఫైల్ )**:తుఫాను ప్రభావితం అయిన ప్రాంతాలలో స్థానిక శాసనసభ్యులు డా. బి. రామాంజనేయులు పర్యటించారు. పర్యటన లో భాగంగా కాకుమాను మండల పరిధిలో నల్లమడ వాగు ఉదృతి వలన పలు చోట్ల పడిన గండ్ల వలన నీరు పంట పొలాలాలను ముంచేత్తడంతో మండల పరిధిలోని కొండపాటూరు, కాకుమాను, అప్పాపురం, రేటూరు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా నల్లమడ వాగు ను పరిశీలించినారు. ఎం ఎల్ ఏ రామాంజనేయులు మాట్లాడుతూ నల్లమడ వాగు పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.రెండు రోజుల్లో కేంద్ర మంత్రి నల్లమడ వాగు పర్యటనకు వస్తున్నారన్నారు. నియోజకవర్గంలో నష్టపోయిన రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వరి, ప్రత్తి, మిరప పంటలకు తీవ్ర నష్టం కలిగింది అధికారులు అంచనా వేస్తున్నారన్నారు.

కాకుమాను మండలం కొండపాటూరులో తుపాను కారణంగా ముంపునకు గురైన వరి పొలాలను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పరిశీలించారు. నల్లమడ వాగు వంతెన పైకి వెళ్లి వాగు ఉధృతిని పరిశీలించారు. అప్పాపురం కొండపాటూరు రహదారిలోని వరి పైరులను పరిశీలించేందుకు ట్రాక్టర్ పై ఆయన ప్రయాణించి వెళ్లారు. నల్లమడ వాగు పరిస్థితి పై రైతులతో మాట్లాడారు. పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఎమ్మెల్యే ఎదుట గోడు చెప్పుకున్నారు.ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ నల్లమడ వాగులో 13 డ్రైన్లు కలుస్తున్నాయన్నారు.వాగు ఆధునీకరణకు ప్రణాళికలు తయారు చేశామని వేసవిలో కొన్ని పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వరద తగ్గగానే 40 లక్షలతో అప్పాపురం వద్ద పూడికతీత పనులు చేపిస్తామని తెలిపారు. 2017 లోనే సీఎం చంద్రబాబు 310 కోట్లు మంజూరు చేశారన్నారు.

అయితే ఆ ప్రాజెక్ట్ లన్నీ వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందదన్నారు. నల్లమడ శాశ్వత పరిష్కారం కింద రూ 450 కోట్లు అవసరం గా ఉందన్నారు. ఖచ్చితంగా సీఎం చంద్రబాబు తో మాట్లాడి నల్లమడ వాగు ఆధునీకరణకు నిధులు మంజూరు చేపిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ బి. వెంకట స్వామి,ఎంపీడీఓ యుగ కీర్తి, వివిధ శాఖలా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

- సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్.స్వర్ణలత



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే మహిళా ఉద్యోగులు అధికారులు విధి నిర్వహణలో అందించే సేవలు ఎంతో కీలకం అని ప్రజలకు ప్రభుత్వానికి వారధి అయిన సమాచార పౌర సంబంధాల శాఖ లో అత్యంత సమర్ధవంతం గా సేవలందించిన సూపరింటెండెంట్ ఎం.రూపవాణి, విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం, లైబ్రేరియన్ గా పనిచేస్తున్న జాస్తి వెంకటలక్ష్మి పనితీరు అభినందనీయమని సమాచారశాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత అన్నారు. ఈ నెల 31న పదవి విరమణ చేయనున్న రూపవాణి, వెంకటలక్ష్మి లకు రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రభత్వ కార్యాలయాలలు పనిచేసే మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని అని అన్నారు. ఒక వైపు గృహిణిగా మరో వైపు ఉద్యోగి గా భాద్యతలను అలు పెరగక నిర్వహిస్తారని అన్నారు దాదాపు 40 సంవత్సరాలు గా వెంకట లక్ష్మి 33 సంవత్సరాలు గా రూపవాణి వారి భాద్యతలను నిర్వర్తిస్తూ తమదైన శైలిలో సేవలు అందించినఇద్దరు మహిళా సిబ్బందికి పదవి విరమణ శుభాకాంక్షలను తెలియజేస్తూన్నాని తెలిపారు. వారి సేవలు నేటి తరం వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు .ప్రభుతవానికీ ప్రజలకు వారిది లా నిలిచే సమాచార శాఖల లో పని చేసే అవకాశం రావడం అదృష్టం గా భావించి ఉద్యోగులంతా సమర్ధవంతం గా పనిచేసి మంచి పేరు సంపాదించాలని కోరారు.

అనంతరం వెంకట లక్ష్మి ప్రసాద్ దంపతులను, రూపవాణి ని సన్మానించారు. కార్యక్రమానిలో రాష్ట్ర సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ.సూర్యచంద్ర రావు డిప్యూటీ డైరెక్టర్లు బి.పూర్ణచంద్ర రావు వెంకట్రాజు గౌడ్, డి. రమేష్ భాస్కరనారాయణ ఎడిలు ఎస్ వి మోహన్ రావు, పి.రాజశేఖర్, ఎ.ఎస్ వీరభద్రరావు, ఎ.నారాయణరెడ్డి, డి ఐపిఆర్ఓ కె వి రమణ రావు, డిఎల్ పి ఆర్ ఓ కె.రవి, విశ్రాంత అధికారి ఎస్ శ్రీనివాస్ జీవన్ యితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యం : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : అన్ని రంగాల్లో ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సంఘం, ఏపీ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి, వాసవీ ఫౌండేషన్, ఐవీఎఫ్ ప్రతినిధులు ప్రతినిధులు గురువారం కలిశారు. రాష్ట్రంలోని వైశ్యులను ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి అనే పేర్లతో సంభోదిస్తున్నారని, వారందరినీ ఆర్యవైశ్యులుగా ప్రభుత్వం గుర్తిస్తూ చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఆది నుంచి సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆర్థికంగానూ, రాజకీయంగానూ అభివృద్ధి చెందేలా ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. 2018-19లో ఆర్యవైశ్యుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ. 30 కోట్లు కేటాయించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. అన్ని కులాల మాదిరిగానే ఆర్యవైశ్యుల్లోనూ పేదలున్నారని, అటువంటి వారిని గుర్తించి ఆర్థికంగా అభివృద్ధే చెందేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాదిరిగా ఆర్యవైశ్యులకు ఆర్థిక భరోసా కల్పించడానికి సహకార క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. త్వరలోనే ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తు న్నామన్నారు. ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా ఆర్యవైశ్యులకు రుణ సదుపాయం కల్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయిదేళ్ల జగన్ పాలనలో ఆర్యవైశ్యులకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ఆర్యవైశ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. ఆర్థిక రంగంలో, వ్యాపారాల నిర్వహణలో ఆర్యవైశ్యులు కీలకమని, తమ వ్యాపారాల నిర్వహణతో ఎందరికో ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఇంటికో వ్యాపార వేత్తను తయారు చేసేలా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధంచేశారన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటులో ఆర్యవైశ్యులకు పెద్దపీట వేయబోతున్నామన్నారు.

**అమ్మవారి పేరుతో వాసవీ పెనుగొండగా నామకరణం** : అమరావతిలో పొట్టి శ్రీరాముల స్మారక స్మృతివనం ఏర్పాటుకు 6.8 ఎకరాల కేటాయించారని మంత్రి సవిత తెలిపారు. ఇటీవల ఆర్యవైశ్యుల కులదైవం కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆత్మార్పణ దినోత్సవం రోజున ప్రభుత్వ తరఫున అధికారికంగా పట్టు వస్త్రాల సమర్పించారన్నారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు జన్మించిన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామానికి వాసవీ పెనుగొండ గ్రామంగా త్వరలో పేరు మార్చనున్నామని, ఈ మేరకు త్వరలో జీవో రానుందని తెలిపారు. దామాషా ప్రకారం ఆర్యవైశ్యులకు పదవుల కేటాయిస్తున్నామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందజేయబోతున్నామన్నారు.

**ఆర్యవైశ్యులుగా గుర్తించేలా కృషి** : వివిధ పేర్లతో సంభోదిస్తున్న ఆర్యవైశ్యులను ఒకే గొడుగు తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నామని, ఇదే విషయం ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని మంత్రి సవిత వెల్లడించారు. ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి...ఇలా వివిధ పేర్లతో పిలుస్తున్న వైశ్యులందరినీ ఆర్యవైశ్యులుగా గుర్తిస్తూ చర్యలు తీసుకునేలా కృషిచేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మొంథా తుఫాన్‌తో భారీ నష్ట కలుగుకుండా సీఎం చంద్రబాబు నాయుడు, అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలను ఆర్యవైశ్య సంఘాలు ప్రతినిధులు కొనియాడారు. అనంతరం మంత్రి సవితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, భగవాన్ నారాయణ, చిన్ని రామసత్యనారాయణ, కె.రజనీ, తల్లం సత్యనారాయణ, వీవీకే నర్సింహారావు, కోనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467